ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





కైకలూరు పంచాయతీలో రూ.8 కోట్ల అవినీతి

సర్పంచ్ నవరత్నకుమారి సస్పెన్షన్

కైకలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కైకలూరు పంచాయతీలో రూ.8.08 కోట్ల అవినీతి వెలుగు చూసింది. సర్పంచ్ డీఎం.నవరత్నకుమారి రూ.4.04కోట్లు అవినీతికి పాల్పడినట్లు ప్రత్యేక విచారణలో వెల్లడవడంతో ఆరు నెలల పాటు సర్పంచ్ పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. అవినీతి ఆరోపణలపై విచారణ జరగడంతో జనవరి 18న సర్పంచ్ చెక్‌పవర్‌ను నిలిపివేశారు. అనంతరం పూర్తిస్థాయిలో జరిగిన విచారణలో రూ.8.08కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు నిర్ధారించారు. ఈ మొత్తంలో సర్పంచ్ రూ.4.04 కోట్లు అవినీతికి పాల్పడడంతో ఆరు నెలలు పాటు సర్పంచ్ పదవి నుంచి తొలగించారు. సర్పంచ్ పదవీకాలంలో పనిచేసిన మరో నలుగురు పంచాయతీ కార్యదర్శులు రూ.4.04కోట్లు వెరసి మొత్తం రూ.8.08 కోట్లు అవినీతికి పాల్పడ్డారు. పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాల్సి ఉన్నది.

నేడు తాత్కాలిక సర్పంచ్ ఎన్నిక..

సర్పంచ్‌ను సస్పెండ్ చేయడంతో ఉప సర్పంచ్ బాధ్యతలు నిర్వహిస్తారు. ఉప సర్పంచ్ మంగినేని పోతురాజు గత ఏడాది మే 2న మృతి చెందారు. మిగిలిన సభ్యుల్లో ఒకరిని తాత్కాలిక సర్పంచ్‌గా ఎన్నుకునేందుకు డీపీవో కె.అనురాధ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం తాత్కాలిక సర్పంచ్‌ను ఎన్నుకునేందుకు సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.ప్రసాద్ తెలిపారు.

ఏలూరు మార్కండేయస్వామి ఆలయ కమిటీ నియామకం

ఏలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి):జిల్లాలో ఆలయ పాలక మండళ్ల ఏర్పాటుకు తొలి అడుగు పడింది. ఏలూరు నగరంలోని దక్షిణపువీధి మార్కండేయ ఓంకారేశ్వరస్వామి ఆలయానికి పాలకమండలిని దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ప్రకటించారు. బి బాలాజీ, ఆనంద వెంకట శివ, సి.దేవి, గోదా గాయత్రి, ఎం.లక్ష్మి, ఎం.సత్య నాగరామలక్ష్మి, జి.హరికృష్ణ, కె.రాజా రామ్మోహన్‌రాయ్, ఎక్స్ అఫిషియో ఆలయ అర్చకులు కె కన్నబాబుతో కూడిన 10 మంది కమిటీని నియమిస్తూ దేవదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ సభ్యులు చైర్మన్, ఉపాధ్యక్షులు, ఇతర పదవులకు సమావేశంలో ఆమోదముద్ర వేయన్నారు. ఆలయాల ఆదాయాల విభజన ప్రకారం కోటిపైబడిన ఆదాయం వచ్చే ఆలయాలకు జాయింట్ కమిషనర్, రూ.50లక్షల పైబడిన ఆలయాలకు డిప్యూటీ కమిషనర్, రూ.15 లక్షలలోపు ఆదాయం వచ్చే కమిటీలకు అసిస్టెంట్ కమిషనర్లకు అందిన దరఖాస్తులతో జాబితాలతో ప్రతిపాదనలను పంపుతారు. ఏసీ పరిధిలో నగరంలో రెండు దేవాలయాలకు ప్రతిపాదనలు పంపగా, ఒక దేవాలయానికి ఉత్తర్వులు రాగా, పవర్‌పేట కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం కమిటి నియామకానికి ఉత్తర్వులు రావాల్సి ఉందని అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు.

3న నీట్ - పీజీ

ఏలూరులో రెండు పరీక్ష కేంద్రాలు

ఏలూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): వైద్య విద్య పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆగస్టు 3న నిర్వహించనున్న నీట్-పీజీ పరీక్షకు ఏలూరు జిల్లాలో కేంద్రాలు ఖరారయ్యాయి. వట్లూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రానికి 200 మంది, సిద్ధార్థ క్వెస్ట్ కేంద్రానికి 178 మంది అభ్యర్థులను కేటాయించారు. ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే పరీక్ష ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుంది. పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థులను ఉదయం 7గంటల నుంచే అనుమతిస్తారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు కేంద్రాల ప్రధాన ప్రవేశ ద్వారాలను పరీక్ష ప్రారంభ సమయానికి అరగంట ముందే మూసివేస్తారు. ఈ నిబంధన నీట్-పీజీకి వర్తింపజేసే విషయంపై మంగళవారం సాయంత్రం వరకు స్పష్టత లేదు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సిటీ ఇన్ఫర్మేషన్‌ను ఇప్పటికే పంపిన ఎన్‌టీఏ సంబంధిత పరీక్ష కేంద్రాల సమాచారాన్ని ఈ నెల 31న జారీచేసే హాల్‌టిక్కెట్లలో మాత్రమే పొందుపరిచేలా చర్యలు తీసుకుంది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి హాల్‌టిక్కెట్‌తోపాటు, ఫోటో గుర్తింపుకార్డు, ట్రాన్స్‌ఫరెంట్ వాటర్ బాటిల్ తీసుకెళ్లాలి. నిబంధనలను హాల్‌టిక్కెట్‌పై ముద్రిస్తారు.

ధరల నియంత్రణకు చర్యలు

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

ఏలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): నిత్యావసరాల ధరల నియంత్రణకు అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. జేసీ ఛాంబర్‌లో ధరల పర్యవేక్షణ జిల్లా కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. కూరగాయలు, నిత్యావసరాలు పెరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అక్రమ నిల్వలపై నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ధాత్రిరెడ్డి ఆదేశించారు. డీఎస్‌వో విలియమ్స్, ఉద్యానశాఖ డీడీ రామ్మోహన్, వ్యవసాయ, లీగల్ మెట్రాలజీ అధికారులు పాల్గొన్నారు.

గర్భిణులకు కిల్కారి సేవలు

ఏలూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, తల్లీబిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారంపై కిల్కారి కాల్ సెంటర్ వినియోగం విస్తృతం చేయాలని డీఎంహెచ్‌వో పీజే.అమృతం అన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశ నోడల్ ఆఫీసర్లు, హెల్త్ సూపర్‌వైజర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో కిల్కారి సేవలపై సమీక్షించారు. గర్భిణీ 4వ నెల మొదలుకుని బిడ్డ జన్మించిన తర్వాత ఏడాది వరకు ఆరోగ్య క్షేమ సమాచారంపై కిల్కారి కాల్ సెంటర్ నుంచి ఫోన్ ద్వారా సమాచారం పొందవచ్చన్నారు. కిల్కారి సేవలను విస్తృతపర్చడంలో ఉత్తమ పనితీరు కనబరిచిన ఆశ కార్యకర్తలకు బహుమతులను అందజేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ఆగస్టు 15 నుంచి మహిళల ఉచిత ప్రయాణానికి ప్రభుత్వం నిర్ణయించడంతో ప్రజారవాణా అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో వివిధ రూట్లలో తిరిగే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సుల మరమ్మతులు దాదాపు 80 శాతం పూర్తి చేశారు. బస్సులు ఎక్కడ ఏ కారణం చేతనైనా ఆగిపోకుండా ఉండేలా పూర్తిగా ఫిట్‌గా చేస్తున్నారు. మొత్తంగా 160 బస్సులు పూర్తి ఫిట్‌నెస్‌తో సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



నూజివీడు బస్టాండ్ పరిశీలిస్తున్న డీపీటీవో షేక్ షబ్నం(ఫైల్)

రైట్.. రైట్..

ఆర్టీసీలో మహిళల ఉచిత ప్రయాణానికి ఏర్పాట్లు

- బస్సుల ఫిట్‌నెస్‌పై అధికారుల దృష్టి
- అవుట్ సోర్సింగ్ డ్రైవర్ల నియామకాలకు చర్యలు
- బస్టాండ్‌లలో ప్రత్యేక ఏర్పాట్లు
- మహిళలకు అదనపు బెంచ్‌లు సిద్ధం
- మరుగుదొడ్డి సౌకర్యం మెరుగుదలకు ఆదేశాలు
- మంచినీరు, లైటింగ్ ఏర్పాట్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. వచ్చే నెల 15 నుంచి ఉచిత ప్రయాణ సౌకర్యం అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహిళల ప్రయాణానికి అనువుగా బస్సులను ఎక్కువ ట్రిప్‌లు నడిపే అవకాశాలున్నాయి. అవుట్ సోర్సింగ్‌లో డ్రైవర్లను ప్రతీ డిపో పరిధిలో 15 మంది చొప్పున అదనంగా సిద్ధం చేసుకుంటున్నారు. ఏలూరు ప్రజా రవాణాశాఖాధికారి షేక్ షబ్నం ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల పరిధిలో రూట్లను పరిశీలించారు. సౌకర్యాలు కల్పించే దిశగా ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ప్రభుత్వం విధివిధానాలు ఇంకా ప్రకటించకున్నా మహిళలు ఆధార్‌ను కలిగి ఉండడం తప్పనిసరి. ఉచిత ఫేర్ టిక్కెట్ జారీ చేయడం తప్పనిసరి చేశారు. రోజూవారి ఎంత మంది ప్రయాణిస్తున్నారని అంచనా వేయవచ్చు. ఉచిత ప్రయాణాలు ఉమ్మడి జిల్లా వరకే అనుమతి ఉంటుందని భావిస్తున్నారు. దీనిపై రెండు, మూడు రోజుల్లోనే పూర్తి విధివిధానాలు రానున్నాయని సమాచారం. ఈలోగా ఆర్టీసీ బస్ డిపోల్లో సకల ఏర్పాట్లను చేసే దిశగా వేగంగా అడుగులు వేస్తున్నారు. మహిళా ప్రయాణికుల కోసం కుర్చీలు పెంచుతున్నారు.

రోజూ 40 వేల మంది ప్రయాణం!

జిల్లాలో ఉచితంగా బస్సుల్లో మహిళలు ప్రయాణించే వారి సంఖ్య 40వేలు ఉండవచ్చని అధికారుల ప్రాథమిక అంచనా. ఉదయం 8 గంటల నుంచి 11 గంటలు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు మహిళలు ప్రయాణాలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. మహిళల ప్రయాణాలకు అనుగుణంగా బస్టాండ్‌లలో అదనపు సౌకర్యాలు సమకూరుతుండడం విశేషం. ఏలూరు బస్టాండ్‌లో ప్లాట్‌ఫారాలపై లైటింగ్ ఏర్పాటు చేయగా, బస్సులు నిలుపుదల చేసే చోట హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఏలూరు ప్రధాన బస్టాండ్‌తో పాటు జంగారెడ్డిగూడెం, నూజివీడు బస్ స్టేషన్లలో సౌకర్యాలను విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఏలూరు కొత్త బస్టాండ్‌లో జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సులు ఆగేచోట్ల పబ్లిక్ టాయిలెట్లను సిద్ధం చేశారు. స్టాల్స్ మధ్యలో మంచినీటి డ్రమ్ములకు అదనంగా నీరు తీసుకునేందుకు మోటార్ల అమరిక చేస్తున్నారు. నూజివీడు బస్టాండ్‌లో ప్రయాణికులు ఆగి, దిగే చోట టైల్స్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ మంచినీరు, ఇతర సౌకర్యాలను విస్తరించే పనిలో ప్రతిపాదనలు పంపారు. జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోలో టాయిలెట్లు నిర్మాణం, ఇతర సౌకర్యాలను పెంచనున్నారు.



గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం చర్యలు

ఎంపీ మహేశ్‌కుమార్

ఏలూరు టూటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో వ్యాపార సౌలభ్యం పెంపొందించేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. పార్లమెంట్ సమావేశాల్లో మంగళవారం ఎంపీ మహేశ్ అడిగి ప్రశ్నలకు కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద్ సమాధానమిచ్చారు. 2014 నుంచి వ్యాపార సౌలభ్య వాతావరణం మెరుగుపరచడంలో నిమగ్నమైందని మంత్రి జితిన్‌ప్రసాద్ తెలిపారు. వ్యాపారాభివృద్ధికి షరతులను కేంద్రం సరళీకృతం చేసిందన్నారు. గ్రామీణాభివృద్ధికి కేంద్రం దృష్టిసారించిందని మంత్రి తెలిపారు.



ఈవీఎం గోడౌన్ పరిశీలిస్తున్న కలెక్టర్

ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్ ప్రాంగణంలోని ఈవీఎం గోడౌన్‌ను డీఆర్వో వి.విశ్వేశ్వరరావుతో కలిసి మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గోడౌన్ వద్ద సీసీ కెమెరాలతో చేసిన భద్రత ఏర్పాట్లను వెట్రిసెల్వి పరిశీలించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి, ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పిస్తున్నామన్నారు. కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర పాల్గొన్నారు.

దాతల సహకారంతో స్కూలు లైబ్రరీల అభివృద్ధి

ఏలూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచేలా ప్రభుత్వ పాఠశాలల్లో గ్రంథాలయాలను బలోపేతం చేయడానికి కార్యాచరణ సిద్ధంచేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సమగ్ర శిక్ష జిల్లా అధికారులను ఆదేశించారు. సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలును మంగళవారం సందర్శించి గ్రంథాలయాన్ని, పుస్తకాలను పరిశీలించారు. వివరాలను ఎస్ఎస్ఏ జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ తెలియజేశారు. జిల్లాలో 249 హైస్కూళ్లుండగా 131 పాఠశాలలకు గ్రంథాలయ రూమ్‌లున్నాయని ఏపీసీ వివరించారు. కొరతవున్న పాఠశాలల వివరాలను అందజేయాలని, దాతలను ప్రోత్సహించి లైబ్రరీలను బలోపేతం చేస్తామని కలెక్టర్ ప్రకటించారు. స్కూలు లైబ్రరీలను పటిష్టవంతంచేసేందుకు రూ.40-50 వేలు చొప్పున నిధులను మంజూరు చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. సుబ్బమ్మదేవి స్కూలు గ్రంథాలయం అభివృద్ధికి రూ.లక్షను మంజూరుచేస్తున్నట్టు కలెక్టర్ ప్రకటించారు. హెచ్‌ఎం కుటుంబ రావు, తదితరులు కలెక్టర్ వెంటవున్నారు.





కదిలారు.. కదిలించారు..

టీడీపీ తొలి అడుగులో ఉంగుటూరు నియోజకవర్గం ప్రథమం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పోటాపోటీగా ప్రజల ముందుకు వెళ్లారు. నెల రోజులుగా ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు వివరించడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఇప్పటివరకు తొలి అడుగులో జిల్లా వ్యాప్తంగా ఉంగుటూరు నియోజకవర్గం తొలిస్థానంలో నిలవగా, పోలవరం ఆఖరి స్థానంలో ఉంది. జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కూడా తెలుగుదేశం శ్రేణులు ఒకింత పట్టుదలతోనే తొలి అడుగు వేస్తున్నాయి.

- క్షేత్రస్థాయిలో విస్తృతంగా కదిలిన టీడీపీ
- చేసిన పనులు ప్రజలకు చేరవేశారు
- ఎమ్మెల్యేలు, స్థానిక కేడర్ ఒకటై సాగారు
- ప్రజల సమస్యలు నమోదు చేసుకున్నారు
- జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లోను పట్టుబిగించారు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ఈ నెల 2న శ్రీకారం చుట్టారు. పార్టీశ్రేణులు పరస్పర సమన్వయంతో ప్రజలకు అన్ని వివరాలను అందించాలని అధిష్ఠానం నిర్దేశించింది. సంక్షేమం, అభివృద్ధికి పార్టీ, ప్రభుత్వం ఎలా కట్టుబడి ఉన్నది వివరించడంతో పాటు ప్రభుత్వం నుంచి ప్రజలు ఏమి ఆశిస్తున్నారో తెలుసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. నియోజకవర్గాల్లో క్లస్టర్ స్థాయి నుంచి ఎమ్మెల్యే లేదా, కన్వీనర్ వరకు పూర్తి బాధ్యత వహించాలని కూడా సూచించారు. ఈ నెల మొదటి వారం నుంచే అందరూ క్షేత్రస్థాయిలో కదిలారు. ఇంటింటికీ ఏడాది విజయాలను వివరిస్తూనే వైసీపీ పాలనలో ఐదేళ్లపాటు సాగిన విధ్వంసాన్ని గుర్తుచేస్తూ వచ్చారు. టీడీపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసినందుకు కేడర్ కూడా ఉత్సాహంగా కదలింది. జిల్లాలో మంత్రులు కొలుసు పార్థసారథి, ఎండీ ఫరూఖ్, కొల్లు రవీంద్ర, అనిత, సవిత వంటి ముఖ్యులంతా నియోజకవర్గాలకు కదలివచ్చారు. స్థానిక నేతలను వెంటబెట్టుకుని ఊరూ వాడా తిరిగారు. దీనితో పార్టీ శ్రేణుల్లోనూ ఉత్సాహం అలముకుంది. దీనికి తోడు స్థానిక టీడీపీ ఎమ్మెల్యేలు కూడా ఒక క్రమపద్ధతిలో దూసుకుపోవడానికి ప్రయత్నించారు. ఈ లోపు కొన్ని నామినేటెడ్ పదవులు భర్తీ కావడంతో పాటు తల్లికి వందనం వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలుతో తొలి అడుగుకు మరింత ఊపు తెచ్చాయి. దీనితో పాటు పార్టీ నియోజకవర్గ పరిశీలకులు కోళ్ల నాగేశ్వరరావు, పార్టీ అధికార ప్రతినిధి శ్యామ్‌చంద్ర శేషు వంటి వారు సైతం ఎక్కడా తగ్గకుండా తొలిఅడుగులో పాలు పంచుకున్నారు.

ఉంగుటూరు టాప్..

జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉంగుటూరు నియోజకవర్గంలో తెలుగుదేశం శ్రేణులు తొలిఅడుగులో సత్తా చాటారు. ఈ నియోజకవర్గంలో 68,124 కుటుంబాలతో తెలుగుదేశం శ్రేణులు మమేకమయ్యారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, నేతలు కార్యకర్తలు ఉత్సాహంగా అడుగు ముందుకేశారు. కార్యక్రమం ముగిసేందుకు కొద్దిరోజులే మిగిలి ఉండగా మారుమూల ఉన్న నివాస గృహాలను సైతం సందర్శించడంతో నూరు శాతం మించి అడుగు వేయగలిగారు. రోజూవారీ కార్యక్రమంను విశ్లేషిస్తున్న వారంతా అధికారికంగా పార్టీ కార్యాలయానికి సమాచారం అందించారు.

తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి కొలుసు పార్థసారధి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు రెండోస్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గంలో 80,348 నివాస గృహాలుండగా వీటిలో 95.80 శాతం నేరుగా సందర్శించారు. కష్టసుఖాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా ఏడాది కాలంగా పార్టీచేసిన మంచి పనులను విడమరిచి చెప్పడంలో మంత్రితో పాటు అక్కడి కేడర్ కూడా విజయవంతమైంది. ఏలూరు నియోజకవర్గంలో తొలి అడుగులో ఎమ్మెల్యే చంటితో పాటు క్యాడర్ పరుగులు పెట్టింది. ఇప్పటిదాకా 88.75శాతం నివాస గృహాలకు



చింతలపూడి నియోజకవర్గంలో తొలి అడుగు కార్యక్రమంలో హోం మంత్రి అనిత, ఎమ్మెల్యే రోషన్, నేతలు (ఫైల్)

మిగతా 8వ పేజీలో..

లోపలి పేజీల్లో..



ఈ ఆహారం తినలేం..

ఎలుకల పెంట, పురుగుల బియ్యంతో ఆహారం

కామవరపుకోట హాస్టలు విద్యార్థుల గగ్గోలు

తినలేక డస్ట్‌బిన్‌లో పడవేశారు!

దొంగల ఆట కట్టు..

రెండు వేర్వేరు కేసులో నలుగురి అరెస్టు

125 గ్రాముల బంగారం, 17 మోటార్ సైకిళ్లు స్వాధీనం

డ్రైయిన్‌లో దూసుకుపోయిన కారు

భర్త మృతి.. ప్రాణాలతో బయటపడిన భార్య

అధ్యాపకులు కావలెను

ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో పోస్టులు ఖాళీ!



భవిష్యత్ తరాలకు వైద్యులను అందించాలనే ఆలోచనతో మెడికల్ కళాశాలల స్థాపనకు నేషనల్ మెడికల్ కమిషన్ అనుమతులు ఇచ్చింది. వైసీపీ పాలనలో హడావుడిగా మెడికల్ కళాశాలల ఏర్పాటుకు తప్పుడు నివేదికలు సమర్పించారు. ఎన్‌ఎంసీకి మాయమాటలు చెప్పి అనుమతి పొందారు. కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, అధ్యాపకుల నియామకంలో విఫలమయ్యారు. ఫలితంగా ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో అంతంత మాత్రం బోధనతో సరిపెడుతున్నారు.

- ప్రొఫెసర్ పోస్టులు 10, అసోసియేట్ 9, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 7 ఖాళీలు
- సూపర్ స్పెషాలిటీలో ప్రొఫెసర్లు 7, అసోసియేట్ 7, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 12 ఖాళీ
- విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య అందేనా?
- ఉన్న ఉద్యోగులపైనే భారం

ఏలూరు క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిని 2022 నుంచి వైద్య కళాశాలగా ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. వాస్తవానికి 2019లోనే వైద్య కళాశాలకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. తర్వాత ఏలూరు మెయిన్ బైపాస్ రోడ్డులో 34 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కళాశాలకు కేటాయిస్తూ వైసీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. చివరకు అది కూడా కాదని 2021 మే 31న ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని మెడికల్ కళాశాల భవనాల ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.550 కోట్లతో మెడికల్ కళాశాలను ఆర్భాటంగా ఏర్పాటు చేశారు. తాత్కాలిక తరగతి భవనాలను ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో నిర్మించారు. మరోవైపు ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో శాశ్వత భవన నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు వసతి గృహాలు, ల్యాబ్‌లకు వేరొక ప్రాంతంలో భవనాలను చూపడంతో ఎన్‌ఎంసీ 2023 ఏప్రిల్ 26న వైద్య కళాశాలకు అనుమతులు ఇచ్చింది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరానికి 150 సీట్లను కేటాయించింది. మరోవైపు ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కేటాయించినా భర్తీ చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ప్రస్తుతం నూతన ప్రవేశాలు పూర్తయితే వారు సెప్టెంబర్ నుంచి తరగతులకు హాజరవుతారు. ఇప్పటికే రెండు, మూడు సంవత్సరాల బ్యాచ్‌ల విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయి. కళాశాలలో వివిధ విభాగాలకు 19 మంది ప్రొఫెసర్లు ఉండాలి. కానీ కేవలం తొమ్మిది మంది మాత్రమే ఉన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లు 40 మందికి 31 మంది ఉన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 56 మందికి 49 మంది ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక వైద్య విభాగాలకు సంబంధించి రెస్పిరేటరీ మెడిసిన్‌కు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. ఎమర్జెన్సీ మెడిసిన్‌కు అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు ఖాళీ. అసిస్టెంట్ ప్రొఫెసర్

మిగతా 8వ పేజీలో..



మొగల్తూరు కూరగాయల మార్కెట్‌లో వేస్తున్న సీసీ ప్లాట్‌ఫాం. సీసీ రోడ్డు.

మొగల్తూరు మార్కెట్‌కు మహర్దశ

వేగవంతంగా సీసీ రహదారి, ప్లాట్‌ఫాం నిర్మాణం

మొగల్తూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): ఎంతో పేరుగాంచిన మొగల్తూరు కూరగాయల రోజువారీ మార్కెట్‌కు మహర్దశ కలిగింది. తీర ప్రాంతమైన మొగల్తూరు పరిసర గ్రామాల్లో నిత్యం కూరగాయలు పండించడంతో పాటు సీజనల్ పండ్లు అయిన సీతాఫలం, మామిడిపండ్లు, సపోటా తదితర పంటలు పండించిన రైతులు మొగల్తూరు డైలీ మార్కెట్‌లో వేలం ద్వారా విక్రమిస్తుంటారు. ఎంతో ప్రాధాన్యత సంతరించకున్న ఈ మార్కెట్‌లోకి వెళ్లే రహదారి ఆక్రమణల పాలవ్వడంతో పాటు మార్కెట్ ప్రాంగణంలో కనీస సదుపాయాలు లేక రైతులు, కొనుగోలు, అమ్మకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొగల్తూరు మార్కెట్ పన్నులు వసూళ్ల ద్వారా ఏటా సుమారు రూ.3 లక్షలు పైబడి పంచాయతీకి ఆదాయం సమకూరుతోంది. వర్షాకాలం వస్తే మార్కెట్‌కు రైతులు పండించిన పంటలు తీసుకువడానికి పంట వేలంలో విక్రయించేందుకు రైతులు, కమీషన్‌దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈమేరకు మొగల్తూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణకు మార్కెట్ అభివృద్ధిపై వర్తకులు, కొనుగోలు దారుల నుంచి వినతులు రావడంతో పాలకవర్గం స్పందించి కూరగాయల మార్కెట్‌కు వెళ్లేందుకు సీసీ రోడ్డుతో పాటు కూరగాయల వేలం నిర్వహించుకునేందుకు ప్లాట్‌ఫాం నిర్మాణానికి తీర్మానించడంతో పనులు వేగవంతంగా చేపట్టారు. నిర్మాణ పనులు జరుగుతుండడంతో వర్తకులు, రైతులు, కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆగస్టు 10న జిల్లాస్థాయి యోగాసన పోటీలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రతినిధులు

ఏలూరు రూరల్, జూలై 29 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అనుబంధ సంస్థ, ఏలూరు జిల్లా యోగాసన భారత్ ఆధ్వర్యంలో ఆగస్టు పదో తేదీన ఏలూరు తూర్పువీధి, మాదేపల్లి రోడ్ లోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమంలో జిల్లాస్థాయి యోగాసనా పోటీలు నిర్వహిస్తున్నట్టు గౌరవ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ తెలిపారు. మంగళవారం స్థానిక గుప్త దివ్య విజ్ఞాన మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల నుంచి 55 ఏళ్ల వయసు గల స్త్రీ, పురుషులు పాల్గొనవచ్చన్నారు. ట్రెడిషనల్ యోగ, ఫార్వార్డ్ బెండ్, బ్యాక్ బెండ్, ట్విస్ట్ లెగ్ బ్యాలెన్స్, హ్యాండ్ బ్యాలెన్స్, సుపైన్, కళాత్మక సింగిల్, కళాత్మక ఫెయిర్, పలు విభాగాలలో పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వయస్సు ధ్రువీకరణ పత్రం, హెల్త్ సర్టిఫికెట్, ఫొటో, మెయిల్ ఐడీ, ఫోన్ నంబర్, సెల్ఫ్ డిక్లరేషన్, ఆధార్ కార్డు సమర్పించాలన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి రాష్ట్రస్థాయిలో పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎం.మల్లికార్జునరావు, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

3న అథ్లెటిక్స్‌కు ఎంపిక పోటీలు

ఏలూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు అల్లూరి సీతారామ రాజు స్టేడియంలో ఆగస్టు మూడో తేదీన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దేవరపల్లి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపిక పోటీలకు ఏలూరు జిల్లా వాసులు మాత్రమే పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. అండర్-14, 16, 18, 20 విభాగాలలో బాల బాలికలను ఎంపిక చేస్తామని తెలిపారు. వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, పదో తరగతి మార్కుల జాబితా తప్పని సరిగా తీసుకురావాలన్నారు. ఎంపికైన జట్టు ఆగస్టు 9, 10, 11 తేదీలలో బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరింత సమాచారానికి 76600 59833 నంబరులో సంప్రదించాలన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మూడో తేదీ ఉదయం ఎనిమిది గంటలకు స్టేడియంలో హాజరు కావాలని కోరారు.

31న ఉద్యాన డిప్లొమాకు మాన్యువల్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి):డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని ఉద్యాన డిప్లొమా కోర్సులు(ల్యాండ్ స్కేపింగ్, నర్సరి మేనేజ్‌మెంట్) కోర్సులకు ఈనెల 31న తుదివిడతగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని నాలుగు ప్రభుత్వ, మరో మూడు గుర్తింపు పొందిన కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విద్యార్థులు స్వయంగా తగిన ధ్రువపత్రాలతో వచ్చి ఆ రోజు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఈనెల 31న ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు వివరించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ పారదర్శకంగా నిర్వహిస్తాం

దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దు

విశాఖపట్నం ఆర్మీ అధికారులు

కలెక్టరేట్(కాకినాడ),జూలై29(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆగస్టు ఐదు నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఆర్మీ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామని విశాఖపట్నం ఆర్మీ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్మీలో ఉద్యోగాల కోసం దళారులను నమ్మి అభ్యర్థులు మోసపోవద్దని పేర్కొన్నారు. ప్రధానంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులకు నియామకం జరుగుతుందని వెల్లడించారు. 8 నుంచి 10 తరగతి పాస్ అయిన అభ్యర్థులు ఈ పోస్టులకు అర్హులన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, అనకాపల్లి, ఏలూరు, ఎన్‌టీఆర్, కాకినాడ జిల్లా, యానాం నుంచి ర్యాలీకి అడ్మిట్ కార్డులు పొందిన అభ్యర్థులు హాజరుకావాలన్నారు. గత మార్చి 12న ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం అన్ని ధ్రువపత్రాలను, స్మార్ట్‌ఫోన్‌లను తీసుకురావాలని పేర్కొన్నారు. దళారులు, ఏజెంట్లు, మధ్యవర్తులను నమ్మవద్దని హెచ్చరించారు.

యండగండి డ్రెయిన్‌లో జలకళ

శివారు ప్రాంతాలకు పరుగులు తీస్తున్న సాగునీరు



ఉప్పులూరు తూము వద్ద వేగంగా ప్రవహిస్తున్న యండగండి మీడియం డ్రెయిన్

ఉండి, జూలై29(ఆంధ్రజ్యోతి): యండగండి మీడియం డ్రెయిన్‌లో సాగునీరు ఉరకలువేస్తూ పరుగులు తీస్తుంది. మీడియం డ్రెయిన్‌లో ప్రక్షాళన పనులు చేపట్టడంతో శివారు ప్రాంతాల్లోని వరి చేలకు సాగునీరు చేరుకుంటుంది. గత ప్రభుత్వ హయాంలో కాలువల్లో అభివృద్ధి పనులు నోచుకోకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వ పాలనలో డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి స్థానిక రైతులు సమస్యను తెలిపారు. ఈమేరకు ఆయన ప్రణాళికతో కాలువ లు, డ్రెయిన్లకు ప్రత్యేక నిధులను సమకూర్చి పనులు పూర్తి చేయించారు. ఈ డ్రెయిన్ యండగండి నుంచి ఉప్పులూరు తూము మీదుగా కోలమూరు, పాములపర్రులో బొండాడ డ్రెయిన్‌లో కలుస్తోంది. ప్రతీ ఏటా ఈ ప్రాంత రైతులు సార్వా పంట సమ యంలో ఆయా తుపాన్‌లతో కురిసే వర్షాలకు వరి పొలాలు ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందేవారు. సుమారు మూడు వేలు ఎకరాలు వరకు ఈ డ్రెయిన్ వెంబడి సాగు జరుగుతుంది. ప్రస్తుతం డ్రెయిన్‌లో ప్రక్షాళన పనులు జరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పనులు పూర్తిచేయించిన డిప్యూటీ స్పీకర్ రఘురామకు రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రైతుల్లో ఆనందం

కూటమి పాలనలో వేగంగా కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులు

అభివృద్ధి పనులు ముందంజతో రైతులు, ప్రజల హర్షం

కూటమి ప్రభుత్వ పాలనలో పశ్చిమ గోదావరి జిల్లాలో కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళన పనులు వేగవంతంగా సాగుతున్నాయి. రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక దృష్టితో పాలకులు, అధికారులు పనులు చేపట్టారు. వీటితో పాటు అభివృద్ధి పనులు చకచకా సాగడంతో రైతులు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యండగండి డ్రెయిన్‌లో చెత్త, తూడు తొలగింపు



ప్రతీ ఏటా యండగండి మీడియం డ్రెయిన్ ముంపు బారిన పడుతుంది. డ్రెయిన్‌లో చెత్త, తూడు తొలగించడంతో సాగునీరు శివారు ప్రాంతాలకు ప్రవహిస్తుంది. కోలమూరు పంట కాలువను అభివృద్ధి చేశాం. తుఫాన్, వర్షాలు కురిసినప్పటికి రైతులు ఆందోళన చెందనవసరం లేదు.

- యర్రా సుబ్రహ్మణ్యం
కోలమూరు నీటి సంఘం చైర్మన్, ఉప్పులూరు



అత్తిలిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారి

సాగుకు సాయం.. రైతన్నకు విజ్ఞానం

జోరుగా 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు

అత్తిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో అన్నదాతకు ఎదురయ్యే సమస్యలు పరిష్కారం చూపుతూ సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ఖరీఫ్‌లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విత్తన ఎంపిక నుంచి పంటచేతి కందించే వరకు ప్రతి దశలో రైతులకు వ్యవసాయాధికారులు సూచనలు చేస్తున్నారు. ప్రకృతి సేద్యం, రసాయన ఎరువుల వాడకంలో జాగ్రత్తలు విత్తనాలు ఎంపిక, బయోఎరువులు యజమాన్య పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రతి మంగళ, బుధవారాల్లో..

ప్రతి మంగళ, బుధవారాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. వ్యవసాయశాఖ అధికారులు ఆయా రోజుల్లో రెండు గ్రామాలను సందర్శిస్తారు. ఉద్యానశాఖ అధికారి ప్రకృతి వ్యవసాయం ఉద్యోగి, పశుసంవర్ధకశాఖ అధికారులు, గ్రామ వ్యవసాయాధికారులు భాగస్వాములవుతారు. రైతులను చైతన్యవంతులను చేస్తున్నారు. పొలాలను పరిశీలించి చీడపీడల నివారణ కాలంలో పంట సస్యరక్షణ పద్ధతులను వివరిస్తున్నారు.

ప్రకృతి సాగు ప్రోత్సహించే దిశగా..

సాగులో రైతులు ఎక్కువగా రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రకృతి సాగు ప్రోత్సహించి ఎస్ఎఫ్ సిబ్బందితో రైతులకు జీవామృతం, బీజామృతం తదితర కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్నారు.

అధిక దిగుబడులు సాధించాలి

పొలం పిలుస్తోంది శిక్షణ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలి. అధికారులు ఇచ్చే సలహాలు సూచనలు పాటిస్తే ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుడులు సాధించాలి.

'గోస్తని'లో కిక్కిస తొలగింపు


రూ.కోటి 30 లక్షలతో 18 కిలోమీటర్ల మేర పనులు



కిక్కిస తొలగింపు పనులు

పెనుమంట్ర, జూలై 29(ఆంధ్రజ్యోతి): అన్నదాత పండించే పంటకు అతివృష్టి అనావృష్టి కారణాలుగా పంట నష్టం వాటిల్లుతుంది. గోస్తనీ నది ప్రవహించే ప్రాంతాల్లో తరచూ ముంపు కారణంగా సోమరాజు ఇల్లిందలపర్రు నుంచి మాముడూరు వరకు 18 కిలోమీటర్లు మేర పంట పొలాలు నష్టానికి గురవుతున్నాయి. గత ఏడాది భారీ వర్షాలకు నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయి. నెల రోజులుగా మురుగు దిగువకు వెళ్లకపోవడంతో రైతులు నష్టపోయారు. ఈ ప్రాంత రైతులు ఇటీవల జరిగిన 'పల్లెపల్లెకు మన పితాని' కార్యక్రమంలో సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామంలో జరిగిన గ్రామ సభలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ దృష్టికి రైతులు తీసుకువచ్చారు. గోస్తనీ నది తవ్వకాలు చేపట్టకపోతే క్రాప్ హాలిడే స్వచ్ఛందంగా ప్రకటిస్తామని రైతులు చెప్పడంతో ఎమ్మెల్యే పితాని ఆధ్వర్యంలో.. సాగునీటి ప్రాజెక్టు మురళీకృష్ణంరాజు దృష్టికి డ్రెయినేజీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేశారు. 18 కిలోమీటర్ల పొడవు పేరుకుపోయిన కిక్కిస తొలగింపునకు సుమారు కోటి 30 లక్షల రూపాయలు ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఇటీవల సోమరాజు ఇల్లిందలపర్రు వద్ద కిక్కిస తొలగింపు ప్రక్రియ ప్రారంభించినట్టు డ్రెయినేజీ ఏఈ వివేకానంద తెలిపారు మరో 20రోజుల్లో గోస్తని నదిలో తొలగింపు పనులు పూర్తిచేస్తామని చెప్పారు. మల్లిపూడి జుత్తిగ, నత్తారామేశ్వరం, పెనుమంట్ర, గరువు, మాముడూరు ప్రాంత రైతులకు ముంపు సమస్య తొలగిపోతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తారకరామ కళావేదికగా డంపింగ్ యార్డు



కళావేదికగా మారిన అనధికార డంపింగ్‌యార్డు (ఇన్‌సెట్‌లో) ప్రహరీ వెంబడి చిత్రాలు

ఆకివీడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఊరు మధ్యలో ఏళ్ల తరబడి ఉన్న అనధికార డంపింగ్‌యార్డును ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు తొలగింపు చేయించి తారకరామ కళావేదికగా మార్చారు. తుమ్మల చెరువుగా ఉన్న సమయంలో ఖాళీ స్థలంలో 1990కి ముందు చెత్త వేయడం మొదలుపెట్టారు. రాను రాను అది అనధికార డంపింగ్‌యార్డుగా మారింది. అనంతరం తుమ్మల చెరువును పూడ్చి తహసీల్దార్, వాటర్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్, అగ్నిమాపకశాఖ కార్యాలయాలతో పాటు 30 పడకల ప్రభుత్వాసుపత్రి నిర్మాణాలు జరిగాయి. ఈ అనధికార డంపింగ్‌యార్డులో చెత్తను అంటించే సమయంలో పొగతో సమీపంలోని పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు,ప్రజానీకం, అధికారులు, ఆసుపత్రి వైద్యులు, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈమేరకు అనధికార డంపింగ్‌యార్డును తొలగించాలంటూ అనేక ధర్నాలు, నిరసనలు చేపట్టారు. పాలకులు, అధికారులు మారినా డంపింగ్‌యార్డును తొలగింపు చేయలేకపోయారు. ఇటీవల డిప్యూటీ స్పీకర్ రఘురామ ఆధ్వర్యంలో అనధికార డంపింగ్‌యార్డును తొలగించి.. తారకరామ కళావేదికగా మార్చారు. ఈ మేరకు వార్డు కౌన్సిలర్ గోపిశెట్టి వెంకటసత్యవతి నేతృత్వంలో పట్టణవాసులు రఘురామను ఘనంగా సన్మానించారు.

పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మరమ్మతులు పూర్తయిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం | నూతనంగా ఏర్పాటు చేసిన కూలింగ్ మోటారు.. వాల్వ్‌లు

పోలవరం, జూలై 29(ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు మంగళవారం నాటికి పూర్తిస్థాయిలో అయ్యాయి. ఈనెల 20 తేదీన 'ఎవరికీ పట్టని పట్టిసీమ' పేరిట వచ్చిన వార్తా కథనానికి స్పందన లభించింది. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఎడమవైపు ప్రధాన ద్వారం ఉన్న రిమోట్ హైడ్రాలిక్ షట్టర్‌ని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. 24 మోటార్లకు వరదల సమయాలలో వినియోగంలో పుట్టే ఉష్ణాన్ని సమశీతల స్థితిలో ఉంచేందుకు 150 అశ్వసామర్థ్యం కలిగిన మోటారుని ఏర్పాటు చేసి వాటికి 6 పంపులు 136 కూలింగ్ వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. స్లూయిజ్ గ్రూపులకు పాత వాల్వ్‌ల స్థానంలో 72 కొత్త వాల్వ్‌లను ఏర్పాటు చేశారు. పైపులైన్ల పొడవునా పలుచోట్ల రైతులు తమ నీటి అవసరాలకు తొలగించిన ఎయిర్ వాల్వ్‌ల స్థానంలో 25 కొత్త వాల్వ్‌లను అమర్చారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకానికి కుడివైపున ఎడమ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల వద్ద కోతకు గురైన గట్టు పటిష్టతకు రాళ్లతో బండ్ ఏర్పాటుచేశారు. ఈదురు గాలులకు ఎగిరి పోయిన రూఫ్ టాప్‌లకు 58 పారదర్శక షీట్లను అమర్చారు. షిఫ్టుల వారీగా పనులు నిర్వహించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. మోటార్లన్నీ రన్నింగ్ కండీషన్‌లో ఉన్నాయని నిర్వహణ బాధ్యతలు చేస్తున్న పవర్ సొల్యూషన్ కాంట్రాక్టుదారులు మరమ్మతుల పనులు సంపూర్ణంగా నిర్వహించారని, మోటార్ల పరిస్థితులను పర్యవేక్షించేందుకు నిరంతరం ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారని పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఈఈ యేసుబాబు తెలిపారు. కృష్ణా, ఉమ్మడి పశ్చిమ డెల్టాల నీటి అవసరాల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నీటి విడుదల చేస్తామని తెలిపారు.

480 ఫోన్ల రికవరీ.. బాధితులకు అందజేత

దొంగ వస్తువులు కొన్నా, అమ్మినా, దాచిపెట్టినా మూడేళ్ల జైలు శిక్ష : ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్



బాధితురాలికి సెల్‌ఫోన్ అందిస్తున్న ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జూలై29(ఆంధ్రజ్యోతి):దొంగిలించిన వస్తువులను కొనడం, అమ్మడం, దాచి పెట్టడం చట్టరీత్యా నేరమని ఈవిధమైన నేరాలకు పాల్పడితే మూడేళ్ల వరకు జైలు శిక్షకు గురవుతారని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ హెచ్చరించారు. జిల్లాలో సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా స్వాధీనం చేసుకున్న మొబైల్స్‌ను మంగళవారం ఏలూరు సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ కల్యాణ మండపంలో బాధితులకు ఆయన అందించి మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు 15 దఫాలుగా సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించామని, 16వ సారి 57లక్షల 60 వేల రూపాయల విలువైన 480 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 3,456 ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ 5 కోట్ల 33 లక్షల 35 వేల 684 రూపాయలు అని అన్నారు. వీటిని ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా, తూర్పు గోదావరి, విజయనగరం, తూర్పుగోదావరి, విశాఖపట్టణం జిల్లాలో, తెలంగాణ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రస్తుతం వినియోగదారుల వద్ద ఈ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామన్నారు. ప్రతి మొబైల్ ఫోన్‌కు ప్రత్యేకంగా ఐఎంఈఐ నంబరు ఉంటుందని దానిని భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా దొంగ ఫోన్లను కొన్నా, విక్రయించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్. సూర్యచం ద్రరావు, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, సీసీఎస్ సీఐ వెంకటేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.



ధర్మాజీగూడెం భవిత కేంద్రంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు

'ఆటిజం' చిన్నారులకు మెరుగైన సేవలు

ఏలూరు జిల్లాలో 4 ప్రత్యేక కేంద్రాలకు చర్యలు

రూ.1.11 కోట్ల నిధులు విడుదల

లింగపాలెం,జూలై 29(ఆంధ్రజ్యోతి): 'ఆటిజం' చిన్నారులు చుట్టుపక్కల పరిసరాలను అర్థం చేసుకునే విధానాన్ని, ఇతరులతో ప్రతిస్పందించడంపై ప్రభావితం చేసే అరుదైనవ్యాధి. దేశంలో ప్రతి 68 మందిలో ఒకరు దీనిబారిన పడుతున్నట్లు పలు అధ్యయనాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో ఈ ఆటిజం సమస్యతో బాధపడుతున్న చిన్నారుల బంగారు భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతి మండల కేంద్రాలలో ఉన్న భవిత కేంద్రాల ద్వారా ఆటిజంకు చికిత్స అందిస్తున్నప్పటికీ వారికి ఇంకా మెరుగైన సేవలందించేందుకు సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో ఒక్కో కేంద్రానికి 27.75 లక్షల రూపాయలతో ఏలూరు, నూజివీడు, చింతలపూడి జంగారెడ్డిగూడెం పట్టణంల్లో నాలుగు ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి ఒక కోటి పదకొండు లక్షల రూపాయల నిధులు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. వాటి ద్వారా జిల్లాలో ఆటిజంతో బాధపడుతున్న 164 మంది విద్యార్థులను ఒకే దగ్గరకు చేర్చి వారికి ప్రత్యేక చికిత్స, సంక్షేమ కార్యక్ర మాలను అందజేసేలా చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిల్లాలో ఉన్న 28 భవితకేంద్రాల్లో 538 మంది విద్యార్థుల మానసిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు ప్రత్యేక సేవలు అందిస్తున్నారు. అంతేకాకుండా వ్యక్తిగత ప్రవర్తన, ఆక్యుపేషనల్, స్పీచ్‌లాంగ్వేజ్, మ్యూజిక్ థెరపీ వంటివి వారితో సాధన చేయిస్తున్నారు.

చిన్నారులకు మెరుగైన చికిత్స, సేవలు



ఆటిజం సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు ప్రత్యేక సేవలు అందించేందుకు జిల్లాలో నాలుగు ప్రత్యేక కేంద్రాలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ కేంద్రాల ద్వారా ఆటిజం ఉన్నవారిని సాధారణ పిల్లలుగా మార్చేందుకు ఈ కేంద్రాలు ఉపయోగపడతాయి. చిన్నారులకు ఎంతో మెరుగైన చికిత్స అందుతుంది. భవిత కేంద్రాలలో సేవలందుకుంటున్న చిన్నారులు కూడా ఈ కేంద్రాలను వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కె.పంకజ్‌కుమార్, జిల్లా అదనపు సమగ్రశిక్ష సమన్వయకర్త

ఉపాధిలో అవినీతికి చెక్..



ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు (ఫైల్)

నిబంధనలు కఠినతరం

పని ప్రదేశంలో రెండు విడతల హాజరు నమోదు

శ్రామికుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్

ఆదేశాలు జారీ చేసిన కేంద్రప్రభుత్వం

జాతీయ ఉపాధి హామీ పథకం అమలులోని అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీని కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎం ఎస్) యాప్ తీసుకొచ్చింది. ఈ విధానం ద్వారా ఉపాధి కూలీలు ఉదయం, సాయంత్రం పనిప్రదేశంలో ముఖహాజరు వేసేలా తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. దొంగ మస్తర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది.

ఏలూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి):
ఉపాధి పథకంలో ఇప్పటివరకు పనులు చేస్తున్న కూలీలు ఒక్కపూట మాత్రమే పని చేసేవారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు వారిని ఫొటోలు తీసి ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) ద్వారా రెండు పూటలూ పనిచేసినట్టు హాజరువేసి ఆ ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. అలా పనిచేసిన కూలీలకు ఒక్కపూట మస్తర్ల ఆధారంగానే వేతనాలు చెల్లించేవారు. ఈక్రమంలో కొందరు ఫీల్డ్ అసి స్టెంట్‌లు అవినీతికి పాల్పడే అవకాశాలు ఎక్కువగా ఉండేవి. సామాజిక తనిఖీలు, ఆడిట్లు జరుగుతున్నప్పుడు అవినీతి జరిగినట్టు రుజువైతే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌లకు జరిమానాలు విధించేవారు. దీనిని అరికట్టేందుకు ఉదయం పనికి రాగానే ఒకసారి, సాయంత్రం నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటోలు తీసి వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. శ్రామికులకు వేతనాలు చెల్లించేందుకు ఈ ఫొటోలు తప్పనిసరి. లేదంటే ఆరోజు వేతనం రానట్టే. జిల్లాలో 27 మండలాల పరిధిలో 3.77 లక్షల జాబ్ కార్డులు ఉండగా 5.57 లక్షల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారని అధికారులు చెబుతున్నారు.

అమలు తీరు ఇలా..

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ ఏపీవోలకు నివేదిక అందజేయాలి.ఎన్ని ఫొటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు పరిశీలించాలి. మండల పరిధిలో వచ్చిన అన్ని ఫొటోలకు సంబంధించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అందజేయాలి. క్షేత్ర స్థాయిలో రెండోసారి ఫొటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మెట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు. నూతన మస్తర్ల విధానం అమలుతో కూలీలు తప్పనిసరిగా పని ప్రదేశంలోనే ఉండాల్సి వస్తుంది.

దాసాంజనేయుడికి విశేష అలంకరణ



ఏలూరుకార్పొరేషన్, జూలై 29(ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసంలోని తొలి మంగళవారం కావడంతో ఏలూరు నరసింహారావుపేటలోని దాసాంజనేయస్వామికి 108 రకాల గారెలతో ప్రత్యేక అలంకరణ జరిపి భక్తులకు దర్శనమిచ్చారు. అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని వీరాంజనేయస్వామికి విశేష అలంకరణ చేసి పూజలు చేశారు.

ద్వారకాతిరుమల సమాచారం

శ్రీవారి క్షేత్రంలో గదులు, కాటేజీల ఖాళీల వివరాలు

ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలో ఈనెల 29 రాత్రి 8 గంటల సమయానికి ఖాళీ ఉన్న రూములు, కాటేజీల వివరాలిలా ఉన్నాయి.

రాణి చిన్నయమ్మారావు సదనం	30
టీటీడీ సత్రం	11
ధర్మ అప్పారాయ నిలయం	81
సూట్	11
బాలాజీ సదనం	4
కాటేజీలు	29



గురుకుల పాఠశాలను జాతికి అంకిత మిచ్చిన సందర్భంగా ఆవిష్కరించిన శిలాఫలకం

కడకట్ల గురుకుల పాఠశాల జాతికి అంకితం

వీసీ సమావేశంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

తాడేపల్లిగూడెం రూరల్,జూలై 29(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెంలోని కడకట్ల గురుకుల పాఠశాలను ఉత్తమ పాఠశాలగా గుర్తించడమే కాకుండా ఆ పాఠశాలను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం ద్వారా జాతికి అంకితం చేశారు. జిల్లాలోని 26 పీఎంశ్రీ పాఠశాలల్లో ఉత్తమ పాఠశాలగా ఎంపికైన గురుకుల పాఠశాలను జాతీయ విద్యావిధానం జాతీయ ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. వీసీ సమావేశంలో ఆయనతో పాటు సహాయ మంత్రి డాక్టర్ సుఖావత్ మజుందార్, జయంత్ చౌదరి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పాఠశాల నిర్వహణ విజయవంతంగా నిర్వహించడమే కాకుండా ఉత్తమ పాఠశాలగా ఎంపిక కావడంపై ప్రిన్సిపాల్ బి.రాజారావు, ఉపాధ్యాయ సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి నారాయణ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్యాంసుందర్, ఏఎంవో సుబ్రహ్మణ్యం, ఎంఈవో వి.హనుమ, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి):రాజీయోగ్యమైన కేసులలో మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నామని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అన్నారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో మంగళవారం ప్యానల్ న్యాయవాదులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కక్షిదారులు నియమించిన ఉచిత న్యాయవాదుల పనితీరు, కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించామని, ఈ కేసులను త్వరితగతిన విచారించి పూర్తి చేయాలని సూచించామన్నారు. ప్రతి రోజు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో రాజీయోగ్యమైన కేసులలో మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నామని కక్షిదారులు అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. కేసులు పరిష్కరించుకుని సమయం, డబ్బు ఆదా చేసుకుని వివాదాలు నుంచి విముక్తి పొందాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ పసల కనకసుందరరావు

పాలదిగుబడి పెంచేందుకు ప్రత్యేక చర్యలు

పెంటపాడు, జూలై29(ఆంధ్రజ్యోతి):పాలదిగుబడి పెంచి రైతులకు ఆదాయాన్ని సమకూర్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనకసుందరరావు అన్నారు. మంగళవారం పెంటపాడు ఉమ్మడి పశ్చిమ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేదెలకు కేవలం పెయ్యదూడలే పుట్టేలా సెమన్‌ను అందిస్తున్నా మన్నారు. దీన్ని రైతులకు సబ్సిడీపై రూ.150లకు అందిస్తున్నామన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పాలదిగుబడి పెంచుకునేలా కృషి చేయాలన్నారు. సంస్థ ఈవో డాక్టర్ సుధాకర్, కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో సుభజిత్ సాహ, వీసీ గోపాల్

రానున్న రోజుల్లో 'భౌగోళిక సూచిక' కీలకం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): రాబోయే పదిహేనేళ్లలో భౌగోళిక సూచిక (జియోగ్రాఫికల్ ఇండికేటర్స్) పాత్ర కీలకం కానుందని లీగల్ ఐపీఆర్ రీసోలేట్ గ్రూప్ ఫౌండర్ సుభజిత్ సాహ పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030నాటికి పది వేల జియోగ్రాఫికల్ ఇండికేటర్స్‌ను నమోదు చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. అనంతరం ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్, సుభజిత్ సహా పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ జియోగ్రాఫికల్ ఇండికేటర్స్ వల్ల కలిగే లబ్ధిపై ప్రసంగిం చారు. కార్యక్రమంలో ఇండస్ట్రియల్, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ కె.ధనుంజయరావు, విశ్వవిద్యాలయ అధికారులు ఎం.మాధవి, బి.శ్రీనివాసులు, ఎస్.సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా దొర



దుర్గాప్రసాద్ దొరను సన్మానించిన అసోసియేషన్ సభ్యులు

ఏలూరు రూరల్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా బొరగం దుర్గాప్రసాద్ దొరను ఎన్నుకున్నారు. మంగళవారం ఏలూరులోని కపర్తిభవన్‌లో న్యూ ఆంధ్ర బాడీ బిల్డర్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సమావేశానికి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కే ఖాసిం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా బాడీ బిల్డర్స్ అసోసియేషన్ కార్యదర్శిగా బొరగం దుర్గాప్రసాద్ దొరను ఎన్నుకుని, త్వరలో సీనియర్ బాడీ బిల్డర్స్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ సభ్యులు దొరను ఘనంగా సత్కరించి అభినందించారు. సమావేశంలో సీనియర్ బాడీ బిల్డర్ ఆకుల దుర్గాప్రసాద్, ఎస్‌కే ఇర్ఫాన్, ఎం.డి. అస్లాం, సాయి బాలాజీ, మోషే, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తినకుండా డస్ట్‌బిన్‌లో పడవేసిన ఆహారం

ఈ ఆహారం తినలేం..

- ఎలుకల పెంట, పురుగుల బియ్యంతో ఆహారం
- కామవరపుకోట హైస్కూలు విద్యార్థుల గగ్గోలు
- తినకుండా డస్ట్‌బిన్‌లోనే పడవేసిన వైనం



కె. కోట హైస్కూల్లో ఎలుకల పెంట, పురుగులు పట్టిన బియ్యం

కామవరపుకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట హైస్కూలులో సోమ, మంగళవారాల్లో ఎలుకల పెంట, పురుగులు పట్టిన బియ్యంతో ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు పెట్టగా వారు తినకుండా డస్ట్‌బిన్‌లో పడవేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఎంసీ చైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఆహారం తినలేకపోతున్నామని విద్యార్థులు ఆయనకు తెలిపారు. దీంతో దివాకర్ ఎంఈవోలు డి.సుబ్బారావు, ప్రశాంతకుమార్‌తో చర్చించారు. ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో ఉన్న బియ్యాన్ని వారానికి రెండు రోజులు వండాలని ఆదేశించడంతో ఆ బియ్యాన్ని వండుతున్నామని, మిగిలిన రోజుల్లో సన్న బియ్యంను వండుతున్నామని చెప్పారు. ఇక నుంచి ఆ బియ్యాన్ని ఉపయోగించబోమని, సన్న బియ్యంతోనే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో ఆహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

హాస్టల్ పునఃప్రారంభానికి కృషి

సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ నాగ సాయమ్మ



అమరవరంలో వసతిగృహం ఏర్పాటుకు అధికారుల పరిశీలన

కుక్కునూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): కుక్కునూరు మండలం అమరవరంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని పునఃప్రారంభించటానికి చర్యలు తీసుకుంటానని, ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని కొయ్యలగూడెం అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నాగ సాయమ్మ తెలిపారు. అమరవరంలో సంక్షేమ వసతి గృహాన్ని పునః ప్రారంభించాలని పూర్వ విద్యార్థులు ఇటీవల జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. పదేళ్ల క్రితం వసతి గృహాన్ని మూసివేశారని, స్థానిక విద్యార్థుల కోసం హాస్టల్‌ను ప్రారంభిస్తే తాము ఆర్థిక సాయం అందిస్తామని వారు ప్రభుత్వాధికారులకు స్పష్టం చేశారు. ఈ క్రమంలో మంగళవారం సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నాగసాయమ్మ ఇతర అధికారులతో కలిసి అమరవరం విచ్చేసి శిథిలావస్థలో ఉన్న పాతవసతిగృహం సందర్శించి వసతిగృహం మూసివేయడానికి గల కారణాలను పూర్వ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే నిధులు వెచ్చించి హాస్టల్ ఏర్పాటుకు తమవంతు సాయం చేస్తామని స్థానిక నాయకులు హామీ ఇచ్చారు. రెంటాల వెంకటి, మేకల ఈశ్వరయ్య, తంబళ్ల కన్నయ్య, చింతమళ్ల కాంతారావు, వెంకయ్య, మడిపల్లి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జ్వరాల సర్వే వేగవంతం చేయాలి

జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ గీతాబాయి



ఆకివీడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబల కుండా క్షేత్ర స్థాయిలో జ్వరాల సర్వే కార్యక్రమం వేగవంతం చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. మంగళవారం స్థానిక సమతా నగర్ రోడ్‌లోని యూపీహెచ్‌సీని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఓపీ రోగులకు అందుతున్న సేవలు, అందుబాటులో మందులు ఉన్నాయా, ఈహెచ్ఆర్ నమోదు తదితర అంశాలపై వైద్యురాలు లిషా, ఏఎన్ఎంలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, రక్షిత మంచినీరు, డయేరియాపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

ముస్లిం వెల్ఫేర్ ఆస్తులు వక్ఫ్‌బోర్డు అధీనంలోకి..



ముస్లింలతో మాట్లాడుతున్న వక్ఫ్ బోర్డు అధికారులు

ఆకివీడు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్‌కు సంబంధించిన ఆస్తుల్లో అవకతవకలు జరుగుతున్నందున వక్ఫ్ బోర్డు అధీనంలోకి తీసుకోవడం జరిగిందని వక్ఫ్‌బోర్డు ఎగ్జిక్యూటివ్ అధికారి సర్కార్ తెలిపారు. స్థానిక ముస్లిం వీధిలో ఆయన ముస్లింలను కలిసి మాట్లాడారు. ఆకివీడులో మూడు మసీదులు, ఈద్గా, చౌల్ట్రీ కి సంబంధించి దుకాణాలు, ఆస్తులు ఇప్పటి వరకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ చూసుకుంటోందని, అయితే ఈ అసోసియేషన్‌లో అవకతవకలు జరుగుతున్నట్టు తమ దృష్టికి రావడంతో నోటీసులు జారీ చేసినా సమాధానం చెప్పలేదన్నారు. అంతే కాక ఆడిటింగ్ కూడా జరగడం లేదన్నారు. సోమవారం విజయవాడలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అజీజ్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో ఆకివీడుకు సంబంధించిన ఆస్తుల విషయంలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. మంగళవారం వక్ఫ్ బోర్డు అధికారులతో వచ్చి భీమవరంలోని డీఆర్‌వో, ఆకివీడు తహసీల్దార్, పోలీసులను కలిసి గజిట్ అందజేయడం జరిగిందన్నారు. అసోసియేషన్‌లో అవకతవకలు జరుగుతున్నందున వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ ఎండీ అలీమ్‌కు అప్పగించడం జరిగిందన్నారు. వక్ఫ్‌బోర్డు నుంచి కొత్త కమిటీ ఏర్పడే వరకు ఆస్తులన్నీ ఆయన చూసుకుంటారన్నారు. విచారణ అనంతరం చర్యలుంటాయన్నారు.



ఏలూరులో ఆటోమొబైల్ షాపు తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ నాగరాజు, తూనికలు- కొలతల అధికారి జీవీ ప్రసాద్

విజిలెన్స్ తనిఖీలు

3 కేసుల నమోదు

ఏలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి పి. మహేష్ ఆదేశాల మేరకు నగరంలోని ఆటోమొబైల్ షాపులపై విజిలెన్స్ తూనికల కొలతల శాఖల అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. మెస్సర్స్ విదుద ఆటో ఏజెన్సీలో తయారీ తేదీ, తయారుదారుని చిరునామా, గరిష్ట చిల్లర ధర, వినియోగదారు సేవల ఫోన్ నంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్న పలు రకాలు లైట్స్, హారన్స్, ఇంజన్ ఆయిల్స్‌ను గుర్తించారు. ఈ షాపుపై తూనికలు-కొలతల శాఖ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. మెస్సర్స్ సురేష్ కంప్యూటర్స్ షాపీ, ఏలూరులో తయారీదారుని చిరునామా, స్టిక్కర్ అతికించి గరిష్ట చిల్లర, వినియోగదారు సేవ ఫోన్ నెంబర్ వంటి సమాచారం లేకుండా ఉన్న కంప్యూటర్ ఉపకరణాలను గుర్తించి సదరు షాపుపై రెండు కేసులను నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎస్ఐ కె నాగరాజు, ఏలూరు తూనికలు-కొలతలశాఖ అధికారి జీవీ ప్రసాద్ పాల్గొన్నారు.



భీమవరం చిన్న వంతెనపై అడ్డంగా నిలిచిన ఆబోతు

వంతెనపై కదలని ఆబోతు

ఐదు గంటలపాటు నిలిచిన ట్రాఫిక్

భీమవరం క్రైం, జూలై 29 (ఆంధ్రజ్యోతి): యనమదుర్రు డ్రెయిన్‌పై గల చిన్న వంతెన మధ్యలో మంగళవారం ఒక ఆబోతు అడ్డంగా నిలబడిపోయింది. దీంతో రెండుపక్కలా వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఎటూ వెళ్ళలేని పరిస్థితుల్లో వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆబోతును కదిపేవారు లేకపోవడంతో అది అలాగే ఉండిపోయింది. ట్రాఫిక్ పోలీసులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఇబ్బందులు తప్పలేదు. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయాయి. సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అదే పరిస్థితి నెలకొంది. దీనిపై ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావును సంప్రదించగా ట్రాఫిక్ పోలీసులను అక్కడకు పంపి ఆబోతుపై నీటిని చల్లించి దానిని వంతెన దాటించడంతో ట్రాఫిక్ సుగమమైంది.

పురుగుల మందు తాగి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం సరిగాలేని ఒక వృద్ధుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన కాలగాని శ్రీనివాసరావు (60)కు భార్య, ఒక కుమార్తె ఉంది. కుమార్తెకు వివాహం చేశారు. కొంత కాలంగా శ్రీనివాసరావు మద్యానికి అలవాటుపడి మతిస్థిమితం కోల్పోయాడు. ఈనెల 27న పురుగుల మందుతాగి తీవ్ర అస్వస్థతకు గురవడంతో ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు

యలమంచిలి, జూలై 29(ఆంధ్రజ్యోతి): అబ్బిరాజుపాలెం గ్రామం నక్కపాలెం ప్రాంతానికి చెందిన యువకుడు చింత సాయిదుర్గా ప్రసాద్ తనను ప్రేమిస్తున్నానని నమ్మించి మోసం చేశాడంటూ యువతి కొల్లాటి శైలజ పోలీసులను ఆశ్రయించింది. మేడపాడులోని ఫ్యాన్సీ షాపులో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తున్న శైలజకు కొంతకాలం క్రితం పరిచయమైన సాయిదుర్గాప్రసాద్ ప్రేమిస్తున్నాని, పెళ్లిచేసుకుంటానని నమ్మించి ఇప్పుడు పెళ్లికి నిరాకరిస్తున్నాడని వాపోయింది. దీంతో శైలజ తన తల్లి దండ్రులు, గ్రామ పెద్దలతో కలిసి దుర్గాప్రసాద్ ఇంటికి వెళ్లి నిలదీయగా ఎలాంటి సమాధానం చెప్పలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.గుర్రయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న శ్రీలత

భీమవరం క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): యానాం, గోవాల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి భీమవరం పట్టణంలో విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీలత తెలిపారు. మంగళవారం సాయంత్రం భీమవరం ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పాతకేసుల్లో ఉన్న బొక్కా శ్రీనివాసరావు, నెగ్రాశా పేటలోని ఒక ఇంట్లో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడులు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో బొక్కా శ్రీనివాసరావును, యానాం నుంచి వచ్చిన మీసాల మణికంఠేశ్వరరావులను అరెస్టు చేసినట్టు తెలిపారు. వీరి నుంచి రూ.74,430 విలువైన 1662 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పోలవరం కాలువలో యువకుడి మృతదేహం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ద్వారకాతిరుమల, జూలై 29(ఆంధ్రజ్యోతి): పోలవరం కుడి ప్రధాన కాలువలో మండలంలోని పంగిడిగూడెం వద్ద ఓ యువకుడి మృత దేహన్ని స్థానికులు మంగళవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. భీమడోలు సీఐ యు.జె.విల్సన్, ఎస్ఐ టి.సుధీర్‌లు కాలు వ వద్దకు చేరుకుని మృతదేహాన్ని వెలుపలకు తీయించారు. విచారణ అనంతరం ఈమృతదేహం కొమ్మరకు చెందిన పొద్దుటూరు శ్యామ్(21) దిగా గుర్తించారు. కొమ్మరకు చెందిన శ్యామ్ ద్వారకాతిరుమలలో ఓ కొరియర్ ఆఫీస్‌లో పనిచేస్తున్నాడు. రెండ్రోజుల క్రితం ఇంటి నుంచి ఆఫీసుకని బయలేరిన శ్యామ్ ఇంటికి చేరలేదు. దీంతో కుటుంబ సభ్యులు ద్వారకాతిరుమల పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేయిం చారు. ఇదిలా ఉంటే మంగళవారం కాలువలో మృతదేహమై బంధు వులు గుర్తించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిశోర్.. స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లు

దొంగల ఆట కట్..

- రెండు వేర్వేరు కేసుల్లో నలుగురి అరెస్టు 125 గ్రాముల బంగారం, 17 మోటార్ సైకిళ్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఒక ఇంట్లో చోరీకి పాల్పడిన దొంగను అతనికి సహకరించిన మరొకరిని అరెస్టు చేసి వారి నుంచి 125 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు ఏలూరు ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఏలూరు వన్‌టౌన్‌లో ఇటీవల ఒక ఇంటి దొంగతనం జరిగింది. ఈ సంఘటనపై వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ కేసు నమోదు చేసి నగరంలోని సీసీ కెమేరాల ఆధారంగా పరిశీలించి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన పిల్ల సురేష్ అలియాస్ శివ(39)ను అరెస్టు చేశారు. శివకు సహకరించిన పాలకొల్లుకు చెందిన నాగళ్ళ ముత్తయ్య గుప్తాను అరెస్టు చేశారు. ముత్తయ్య గుప్తా దొంగలకు సహకరిస్తూ దొంగ సొత్తును తీసుకుని క్రయావిక్రయాలు చేస్తుంటాడని ఎస్పీ వివరించారు. మరో నిందితుడిని ఈ కేసులో అరెస్టు చేయాల్సి ఉందన్నారు. వీరిని నుంచి 11లక్షల 50 వేల రూపాయలు విలువైన 125 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్ర రావు, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

17 మోటార్ సైకిళ్లు స్వాధీనం

ఏలూరు త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు వారి సిబ్బంది కలిసి నిఘా పెట్టి అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని విచారించగా మోటార్ సైకిళ్ల దొంగలుగా గుర్తించారు. వారి నుంచి 17 మోటారు సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ వెల్లడించారు. కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన సయ్యద్ రజక్ (50) అతని సోదరుడు సయ్యద్ కరీముల్లా(45) కలిసి హీరో గ్లామర్ మోటార్ సైకిల్‌ను హీరో కంపెనీ మోటారు సైకిల్‌ను తస్కరించి వాటి ఇంజన్ నెంబర్, ఛాయిసిస్ నెంబర్లను చెరిపి ఆన్‌లైన్ వాహన పోర్టల్ ద్వారా విక్రయించేవారు. వీరిని అదుపులోకి తీసుకుని ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.6,68,000 విలువైన 14 మోటారు సైకిళ్లు, భీమడోలు సీఐ యుజె విల్సన్ ఆధ్వర్యంలో రూ.లక్షా 40 వేల విలువైన మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు.

డ్రెయిన్‌లో దూసుకుపోయిన కారు

భర్త మృతి.. ప్రాణాలతో బయటపడిన భార్య

ముదినేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో ముదినేపల్లి సమీపంలోని పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌లోకి మంగళవారం రాత్రి కారు దూసుకుపోయిన ఘటనలో భర్త మరణించగా భార్య ప్రాణాలతో బయటపడింది. మండవల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎస్ఆర్ఎస్‌పి సైంటిస్ట్ చందు వెంకటేశ్వరరావు తన భార్య రాణితో కలిసి హైదరాబాద్ నుంచి కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు పోల్‌రాజ్ డ్రెయిన్‌లోకి కారు దూసుకుపోయింది. కారు డ్రైవ్ చేస్తున్న వెంకటేశ్వరరావు మరణించగా కారులో ఉన్న అతని భార్యను అక్కడికి సమీపంలో చేపల చెరువులపై పనిచేస్తున్న కొందరు యువకులు డ్రెన్‌లో దిగి కారు అద్దాలు పగులకొట్టి ఆమెను రక్షించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వీరభద్రరావు తన సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కారు పూర్తిగా నీటిలో మునిగి పోయింది.

అధికార్ల తప్పిదం వల్లే : ఈ ప్రమాదం జరగడానికి గల కారణం జాతీయ రహదార్ల అభివృద్ధి సంస్థ అధికార్లదే అని తెలుస్తోంది. పోల్‌రాజ్ డ్రెన్‌కు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేస్తుండటం, కనీసం డ్రెయిన్ వద్ద రోడ్డు డైవర్షన్ బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రెండు వైపులా వాహనాలు సరాసరి డ్రెయిన్‌లోకి వెళ్లిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

రెండు మోటార్ సైకిళ్లు ఢీ.. ఇద్దరికి గాయాలు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

మొగల్తూరు, జూలై29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై పోలీస్ స్టేషన్ మలుపు వద్ద రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో మంగళవారం ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారిపాలేనికి చెందిన ఊటాల గాబ్రియేల్ గొల్లగూడెం వైపు వెళ్లేందుకు మోటార్ సైకిల్‌పై రోడ్డు క్రాస్ చేస్తుండగా కొత్తకాయలతిప్ప నుంచి మరో మోటార్ లైకిల్‌పై వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాబ్రియేల్‌కు కాలు ఇరిగిపోవడంతో స్థానికులు 108 వాహనంలో నరసాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



రవీంద్ర మృతదేహం

టి.నర్సాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం టి.నర్సాపురంలో చోటు చేసుకుంది. కె.జగ్గవరం గ్రామానికి చెందిన కొమ్ము రవీంద్ర(22) టి.నర్సాపురం గ్రామంలో ఓ రైతుకు చెందిన తోటలో ఫామాయిల్ గెలలు కోసేందుకు మంగళవారం ఉదయం వెళ్లాడు. గెలలు నరికే సమయంలో ప్రమాద వశాత్తు ఆయిల్‌పామ్ గెలలు నరికే ఇనుప గెడకు విద్యుత్ వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. రవీంద్రను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్ష చేసిన వైద్యులు రవీంద్ర చనిపోయినట్టు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదుతో హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజు కేసు నమోదు చేశారు.

బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు



ఏలూరు క్రైం, జూలై 29(ఆంధ్రజ్యోతి):అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడి ఆచూకీ గుర్తించిన ఏలూరు టూటౌన్ సీఐ అశోక్ కుమార్ తల్లికి అప్పగించారు. ఈనెల 27వ తేదీ రాత్రి ఏలూరు వీరపురెడ్డివారి వీధికి చెందిన దాసరి సురేంద్ర కుమారుడు రోహన్(13) తన అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అతని ఆచూకీ కనిపించకపోవడంతో ఈనెల 28న ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి నగరంలోని సీసీ కెమేరాలను పరిశీలించారు. ఆ బాలుడు పవర్‌పేట రైల్వే స్టేషన్ నుంచి రైలు ఎక్కి ఒంగోలు వెళ్లినట్టు గుర్తించారు. దీంతో ప్రత్యేక బృందాన్ని పంపించి మంగళవారం ఉదయం తీసుకొచ్చి తల్లికి ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో అశోక్ కుమార్ అప్పగించారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

చింతలపూడి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని రేచర్ల, మల్లాయిగూడెం గ్రామ సచివాలయాల వద్ద ప్రదర్శన జరిపి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. భూమిలేని కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. తక్కెళ్ళపాటి ప్రసాదరావు, స్థానిక కౌలు రైతులు పాల్గొన్నారు.

పెదరామచంద్రాపురంలో రీసర్వే పూర్తి

నిడమర్రు, జూలై 29(ఆంధ్రజ్యోతి): రైతులు తమ భూములను రీ సర్వే చేయించుకోవడం ద్వారా ఖచ్చితత్వంతో కూడిన రికార్డులు పొందవచ్చని రీసర్వే డీటీ వేదసాయి రమేశ్ పేర్కొన్నారు. మంగళవారం అడవికొలను పంచాయతీ పెదరామచంద్రాపురం గ్రామంలో రీసర్వే పూర్తయిన సందర్భంగా రైతులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పాలా వెంకటేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ పోశింశెట్టి రామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి రామారావు, ఆర్.ఐ. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డుకు మరమ్మతులు


మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, జూలై 29(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం పురపాలక సంఘం సాధారణ నిధులు రూ.10 లక్షలతో పొట్టిశ్రీరాములు సెంటర్ నుంచి ఏలూరు రోడ్డులో ఏర్పడిన గుంతలను మంగళవారం పూడ్చించారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాలతో ఈ మరమ్మతులు చేపట్టినట్టు టీడీపీ పట్టణాధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ తెలిపారు. మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్‌లు కరుటూరి రమాదేవి, పీపీఎన్ చంద్రరావు, రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు,బత్తిన చిన్నా, టీడీపీ సీనియర్ నాయకుడు పరిమి సత్తిపండు, గుమ్మడి ప్రసాద్, మహంకాళి రాంబాబు, కె.రాంబాబు, టి.ఆనంద్ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

ద్వారకాతిరుమల, జూలై 29(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎందరో నిరుపేదలకు మేలు జరుగుతోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది లబ్ధిదారులకు తిమ్మాపురంలో మంగళవారం రూ.11.92 లక్షల చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో కోట్లాది రూపాయలను సీఎంఆర్ఎఫ్ కింద బాధిత కుటుంబాలకు అందజేసినట్టు తెలిపారు. నేతలు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీను, ఘంటా శ్రీనివాసరావు, మద్రాస్ రాము, పసుమర్తి శేఖర్, కారుమంచి మురళి, ఎం.రత్నాజీ పాల్గొన్నారు.

సీఆర్ఆర్‌లో టాటా, ముళ్లపూడి జయంతి


నివాళులర్పిస్తున్న విద్యా సంస్థల నిర్వాహకులు

ఏలూరు అర్బన్/పెదపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): టాటా గ్రూపుల వ్యవ స్థాపక అధ్యక్షుడు, భారతరత్న జే.ఆర్.డీ.టాటా 121వ జయంతి, ఆంధ్రా సుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 104వ జయంతిని మంగళవారం సీఆర్ఆర్ పీజీ కళాశాలలో నిర్వహించారు. పారిశ్రామికవేత్తలు ఎం.శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీరమణి, కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సి పాల్ రామరాజు, పీజీ కోర్సుల డైరెక్టర్ యలమర్తి బాబు, ఈడీసీ కో-ఆర్డినేటర్ టి.రాజేశ్ పాల్గొన్నారు. వట్లూరు సర్‌సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో టాటా చిత్రపటానికి తపన ఫౌండేషన్ చైర్మన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ ప్రగతిలో జేఆర్డీ టాటా సేవలు ఎనలేనివని కొనియాడారు. కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు, కొండా హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, హెచ్‌వోడీ కేవీశ్రీధర్, కో-ఆర్డినేటర్ సతీష్, విఠల్ పాల్గొన్నారు.

నానో యూరియా వాడితే కాలుష్యాన్ని తగ్గించవచ్చు

పెదపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): పెదపాడు, నాయుడుగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పంటల సాగు, ఎరువుల వాడకంపై వ్యవసాయాధికారి షేక్ ఖాసిం వివరించారు. ఆయన మాట్లాడుతూ రైతులంతా యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో-యూరియా వాడాలని, నానో-యూరియా ద్రవరూపంలో ఉంటుందని, లీటరు నీటికి 2-5 మి.లీటర్ల చొప్పున కలుపుకుని పొలంలో పిచికారీ చేసుకోవాలన్నారు. పిలకలు వేసే సమయం, పూత దశకు ఒక వారం రోజుల ముందు పిచికారీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీని వాడకం వల్ల నేల, నీరు, గాలి కాలుష్యాన్ని తగ్గించవచ్చన్నారు. పెదపాడు డీసీ అధ్యక్షులు బొప్పూడి కాశీబాబు, అక్కినేని వంశీకృష్ణ, కట్నేని యుగంధర్ పాల్గొన్నారు.

కదిలారు.. కదిలించారు..

(5వ పేజీ తరువాయి)

వెళ్లి టీడీపీ ప్రభుత్వ విజయాలను వివరించగలిగారు. సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరు నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ నిర్విరామంగా పనిచేసింది. ప్రతీ ఊరిలో పండుగ వాతావరణం తలపించేలా చింతమనేని యాత్ర సాగింది. ఇప్పటిదాకా ఈ నియోజకవర్గంలో 74.75 శాతం నివాస గృహాలను టచ్ చేయ గలిగారు. చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌తో పాటు మిగతా కేడర్ 46.88, కైకలూరులో 47.95, పోలవరంలో 32.02 శాతం నివాస గృహాలను ఆయా కుటుంబాలను స్థానిక నేతలు కలుసుకోగలిగారు. పోలవరం నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రాతినిధ్యం వహిస్తుండగా జిల్లాలో విస్తీర్ణంలో అతి పెద్దదైన ఈ నియోజకవర్గంలో ఆయా కుటుంబాలను కలుసుకోవడానికి తెలుగుదేశం ప్రయత్నించింది. కైకలూరులో బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఈ నియోజకవర్గంలో కూడా టీడీపీ వెనుకంజ వేయకుండా ఆయా గ్రామాల్లో కుటుంబాలను టచ్ చేస్తూనే వచ్చింది. మొత్తం మీద తొలి అడుగులో ఏలూరు జిల్లావ్యాప్తంగా ప్రజలతో మమేకం కావడంలో టీడీపీ ఒకింత విజయం సాధించినట్లే కనిపిస్తోంది.

అధ్యాపకులు కావలెను

(5వ పేజీ తరువాయి)

ఒక పోస్టు ఉండగా అది భర్తీ చేశారు. సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. న్యూరాలజీలో సైతం ప్రొఫెసర్. అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెండు, న్యూరోసర్జరీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు ఒకటి భర్తీ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండు పోస్టులు ఉండగా రెండు ఖాళీగానే ఉన్నాయి. నెఫ్రాలజీ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెండు, యూరాలజీ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండు ఖాళీగానే ఉన్నాయి. మొత్తం సూపర్‌స్పెషాల్టీ విభాగాలకు ఏడు ప్రొఫెసర్ పోస్టులకు ఏడూ ఖాళీగానే ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు 8 ఉండగా, ఏడు ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 13 ఉండగా 12 ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బంది పైనే భారం పడుతున్నా నాణ్యమైన విద్యనందించడానికి వారు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. కిందిస్థాయి సిబ్బంది 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ఇటీవల డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసి మెరిట్‌ను క్రోడీకరిస్తున్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు మొదటి సంవత్సరం అనాటమి, ఫిజియోలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. వీటికి సంబంధించిన ల్యాబ్‌లలో అవసరమైన రియాజెంట్స్, స్ట్రిప్స్ లేవని తెలుస్తుంది. విద్యార్థులే బయట సర్జికల్ షాపుల నుంచి కొనుగోలు చేసుకుంటున్నట్లు సమాచారం. ద్వితీయ సంవత్సరంలో మైక్రో బయోలజీ, ఫార్మకాలజీ, పెథాలజీ సబ్జెక్టులు ఉండగా ల్యాబ్‌లు ఏలూరు ప్రభుత్వాస్పత్రి, పాత బస్టాండ్ సమీపంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉన్నాయి. ఏలూరు ప్రభుత్వాస్పత్రి ల్యాబ్‌ల్లో అన్ని విభాగాల మెటీరియల్, అవసరమైన కిట్స్ అందుబాటులో లేవని తెలుస్తోంది. మూడో సంవత్సరంలో ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఎస్పీఎం(సోషల్ ప్రివెంట్ మెడిసిన్) కమ్యూనిటీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్ సబ్జెక్టులు ఉంటాయి. ఫోరెన్సిక్ విభాగానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఎలాంటి ల్యాబ్ కాని ప్రత్యేక విభాగం లేదు. కేవలం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడం వరకే పరిమితం. ఇతర వైద్య పరీక్షలకు విజయవాడ, గుంటూరు పంపిస్తున్నారు. వివిధ మృతదేహాల నుంచి తీసిన అవయవ భాగాలను విజయవాడ ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. మూడో సంవత్సరంలోకి వస్తున్న విద్యార్థులు విద్యను ఏవిధంగా అభ్యసిస్తారో అన్నది గందరగోళంగా మారింది. ఇప్పటికైనా పోస్టులను భర్తీ చేసి మెరుగైన విద్యను విద్యార్థులు అందించాల్సి ఉంది.



పోస్టుల భర్తీకి చర్యలు : ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులన్నీ భర్తీ అయ్యే అవకాశాలున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన 35 పోస్టుల భర్తీకి ఇప్పటికే డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా నోటిఫికేషన్ జారీ అయింది. మూడో బ్యాచ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు చేరే నాటికి అన్ని పోస్టులు భర్తీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ల్యాబ్‌ల్లో అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనే ఉత్తమ ర్యాంకులు సాధించారు. విద్యార్థులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

డాక్టర్ పి.సావిత్రి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఏలూరు


నాట్లు వేస్తున్న రైతులు

వడివడిగా నాట్లు

ఏలూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురవడంతో రైతులు నాట్లు పనుల్లో నిమగ్నమయ్యారు. ఏలూరు రూరల్ మండలంలో గతేడాదితో పోలిస్తే వారం పదిరోజులు ఆలస్యంగా నాట్లు పడుతున్నాయి. ముందస్తు వర్షాలు కురుస్తాయని అంచనాలున్నా వరుణుడు కరుణించ లేదు. దీంతో నాట్లు పెద్దగా వేయలేదు. మండలంలో మల్కాపురం, సుంకరివారి తోట, జాలిపూడి, కాట్లంపూడి, మాదేపల్లి, పోనంగి, ప్రాంతాల్లో ఖరీఫ్ నాటు ప్రారంభించారు. కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో ఎకరానికి 5000 వరకు తీసుకుంటున్నారు. కూలీలు, ఎరువులు, పురుగు మందుల ధరల పెరుగుదలతో రైతులు ఆందోళన చెందుతున్నారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దళితసేన


లేబర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



గుర్వాయిగూడెంలో ధర్నా చేస్తున్న రైతులు

మాగోడు వినండి మహాప్రభో..

జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు, విజ్ఞప్తులు

సంక్షేమ పెన్షన్లు విడుదల చేయండి

ఏలూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పెన్షన్లు విడుదల చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద మంగళవారం దళితసేన ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈసందర్భంగా దళితసేన వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అర్హులందరికి వృద్ధాప్య, వితంతు, డప్పు కళాకారుల పెన్షన్లు, చెప్పులు కుట్టే చర్మకారు పెన్షన్లు దివ్యాంగులు పెన్షన్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసరాల ధరలతో వారి జీవన విధానం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జేసీ ధాత్రిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మహిళా అధ్యక్షులు బేతాల జయసుధ, అధ్యక్షులు చిలి మోహన రావు, స్టాలిన్, దొండపాటి మాణిక్యాలరావు, లక్కపాము చంటి, పింగుల ఈదియా పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుటూటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): గౌతమి ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు యూ.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ కార్మికులు జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జీతాలు పెంచటంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని గత నాలుగు నెలలుగా ఆందోళన చేస్తున్నప్పటికీ యాజమాన్యం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయానికి చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రావు, యూనియన్ అధ్యక్షులు పద్మావతి, ఎం.ఆలీసమ్మ, రంగమ్మ, రాణి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లపై సంతకాల సేకరణ

చింతలపూడి, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ మండలంలో జోరుగా సాగుతోంది. రెండవ రోజు ప్రగడవరంలో సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. గ్రామంలో వినియోగదారులతో మాట్లాడుతూ ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ భారం పెరుగుతుందన్నారు. కంచర్ల గురవయ్య, ఎస్.కె.కాలేషా, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ రైతులకు న్యాయం చేయండి

జంగారెడ్డిగూడెం, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని గురవాయిగూడెం మానవత కల్యాణ మండపంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసితుల సదస్సు వామిశెట్టి హరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సదస్సులో పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ గీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులకు ప్రభుత్వం ఇచ్చిన ఏ హామీలను నెరవేర్చలేదన్నారు. సమస్యల పరిష్కారానికి ఆగస్టు 4న గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతులతో చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టాలన్నారు. పుట్లగట్లగూడెం గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్ద సర్వీసు రోడ్లు నిర్మించాలని రైతులు ధర్నా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం, టి.నరసాపురం, చింతలపూడి, కొయ్యలగూడెం, దేవరపల్లి, గోపాలపురం మండలాల రైతులు పాల్గొన్నారు.


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

విష జ్వరాలపై అవగాహన

టి.నర్సాపురం, జూలై 29(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం, బొర్రంపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో విష జ్వరాలపై అవగాహన ర్యాలీ వైద్యాధికారులు కల్పనారాణి, అంజనేయుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.చింతలపూడి సబ్‌యూనిట్ మలేరియా అధికారి ఎస్.ఎ.ప్రసాద్ మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆరోగ్య విస్తర్ణాధికారి ఏడుకొండలు, సబ్‌యూనిట్ హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏలూరులో అంటు వ్యాధులపై..

ఏలూరు అర్బన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): దోమల వృద్ధిని అరికట్టడానికి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతలే కీలకమని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు సూచించారు. మంగళవారం ఆముదాల అప్పల స్వామి కాలనీ అర్బన్ హెల్త్‌సెంటర్ పరిధిలో అంటు వ్యాధులపై అవగాహన, నివారణ చర్యలపై సమావేశం నిర్వహించారు. కాల్వల్లో చెత్త వేయరాదని, ఇంటి పరిసరాల్లో మంచినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. వైద్యాధికారి నవ్య పాల్గొన్నారు.

గ్రామాల్లో సుపరిపాలన ప్రచారం

చింతలపూడి, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలోని పాతచింతలపూడి, చింతలపూడి మెయిన్ రోడ్డులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. నాయకులు టి.అప్పారావు, కె.శేషగిరిరావు, కె.రమేష్, కె.రాజారత్నం, ఆదాం పాల్గొన్నారు.

అభివృద్ధిలో వెనుకడుగు వేయం : చంటి

ఏలూరుటూటౌన్: రాష్ట్రాభివృద్ధిలో వెనకడుగు వేసే ప్రసక్తిలేదని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పత్తేబాదలో ఎమ్మెల్యే పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.. డివిజన్ ఇన్‌చార్జి పృధ్వీలక్ష్మి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ నాయుడు సోము, కోఇన్‌ఛార్జ్ ఐ.పరమేశ్వర్, పీ.సత్తిరెడ్డి, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

పోతునూరులో పొలం పిలుస్తోంది

చింతలపూడి, జూలై 29(ఆంధ్రజ్యోతి): పోతునూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ సహాయ సంచాలకులు సుబ్బారావు, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఫణికుమార్‌లు బీమా పథకంపై అవగాహన కల్పించారు. ప్రతీ రైతు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన నమోదు చేసుకోవాలని, ఎకరాకు రూ.840 చెల్లించాలని, దీనికి ఆగస్టు 30ఆఖరు తేదీ అని తెలిపారు. వరిపై తెగుళ్ళ, యాజమాన్య పద్ధతులు, నివారణ చర్యలు వివరించారు.

పెదకడిమి, భోగాపురంలో..

దెందులూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెదకడిమి సర్పంచ్ కొసరాజు బలరామకృష్ణ చౌదరి అన్నారు. మంగళవారం మండలంలోని పెదకడిమి, భోగాపురం గ్రామాల్లో వ్యవసాయ శాఖాధికారి సి.హెచ్.శ్రీనివాస్, ఉద్యానవనశాఖ అధికారి ఎం.రత్నమాల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, కొప్పాక సొసైటీ కార్యదర్శి రమేశ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడి వైద్య సేవలందించండి

చింతలపూడి, జూలై 29(ఆంధ్రజ్యోతి):నిర్లక్ష్యం వీడి ఆస్పత్రికి వచ్చే రోగులకు వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మంగళవారం ఏరియా ఆస్పత్రి ఆవరణలో అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చే బడుగు, బలహీన వర్గాల పట్ల నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. అభివృద్ధి కమిటీ సభ్యులు సైతం రోగులకు భరోసాగా ఉండాలన్నారు. సూపరింటెండెంట్ నారాయణరావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు దేవ పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించాలి

దెందులూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రజలను ఇబ్బంది పెట్టకుండా వేగంగా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మంగళవారం దెందులూరు క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దెందులూరు,పెదపాడు, పెదవేగి మండలాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను చింతమనేని స్వీకరించారు. నాలుగు మండలాల్లోని ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డుల మంజూరు, రైతుకు సహాయం వంటి వాటిపై దృష్టిపెట్టాలన్నారు.



పాఠశాలలో అవగాహన కల్పించిన బృందం

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

ఉంగుటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాప్ ఆధ్వర్యంలో మంగళవారం కైకరం హైస్కూల్లో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. వీధినాటిక ప్రదర్శించారు. క్రాప్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.రవిబాబు, జడ్పీ హైస్కూలు హెచ్ఎం గుళ్లపల్లి గవరయ్య, ఎం.శివ శంకర్, శాంతి కల్చరల్ సొసైటీ కళా బృందం సభ్యులు రవి కుమార్, రంగనాయకి, శ్రావణి, మహేష్, చిన్ని,ఉపాధ్యాయనిలు వైకే స్వర్ణలత, పి.సత్యకళ, అంగన్వాడీలు లక్ష్మి, సద్భావతి, సునీత పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

పెదపాడు:విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అడ్వకేట్ కె.సీతారామారావు తెలిపారు. వట్లూరులోని సర్‌సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, కామర్స్ విభాగం, ఐక్యూఏసీల ఆధ్వర్యంలో చట్టాలపై మంగళవారం అవగాహన కల్పించారు. మహిళలకు అండగా ఉన్న చట్టాల గురించి తెలియజేశారు. అడ్వకేట్‌లు వి.మునీశ్వరరావు, రత్నరాజు, కళాశాల ఇంఛార్జి కరరస్పాండెంట్ వంకినేని భానుప్రకాష్, ప్రిన్సిపాల్ జి.సరళ, హిమబిందు, కె.వాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

జనసేన పార్టీ డివిజన్ కమిటీల ఎన్నిక

ఏలూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని 21, 22వ డివిజన్లకు మంగళవారం నూతన కమిటీలను ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు ప్రకటించారు. 21వ డివిజన్ కమిటీకి ఇళ్ల శ్రీనివాస్ ఇంచార్జిగా, నరహరిశెట్టి సోమేశ్వరరావును అధ్యక్షుడిగా, 22వ డివిజన్‌కు కన్న వరప్రసాద్‌ను డివిజన్ ఇంచార్జిగా తాడికొండ శ్రీనివాస్‌ను అధ్యక్షుడిగా నియమించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నూతన డివిజన్ కమిటీల అధ్యక్షులను రెడ్డప్పల నాయుడు అభినందించారు. పార్టీ విజయానికి కార్యకర్తలే బలమన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రతీ నాయకుడు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు.


కల్వర్టు వద్ద దిగబడిన లారీని లాగుతున్న ఎక్స్‌కవేటర్

కల్వర్టు నిర్మించినా తప్పని కష్టాలు

జీలుగుమిల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి - పి.రాజవరం గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రాత్రి సమయంలో కాలువపై నిర్మించిన కల్వర్టు వద్ద వర్షాల వల్ల మట్టిలో వాహనాలు దిగబడి ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కురిసిన వర్షాల కారణంగా రోడ్డు కొట్టుకుపోయింది. కల్వర్టుపై నుంచి వాహనాలు వెళ్లేందుకు రెండు వైపులా మట్టిపోశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు వాహనాలు మట్టిలో కూరుకుపోయి ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం రాత్రి కల్వర్టు వద్ద మక్కినవారిగూడెం వెళ్లే సిమెంట్ లోడు లారీ దిగబడి టైర్లు మట్టిలో కూరుకుపోయాయి. దీంతో జేసీబీ సాయంతో లారీని బయటకు లాగారు.

ఉపాధి నిధుల వినియోగంపై సామాజిక తనిఖీ

ఉంగుటూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలో 17వ విడత ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ నిమిత్తం మంగళవారం సన్నాహక సమావేశం జరిగింది. సమావేశంలో ఎస్సార్‌పీ తిరుమలరావు, ఎంపీడీవో రాజ్ మనోజ్‌లు మాట్లాడుతూ గ్రామాల వారీగా 15 రోజులు సామాజిక తనిఖీలు నిర్వహిస్తారన్నారు. వీరితో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆడమిల్లిలో ముమ్మరంగా రోడ్డు పనులు

కామవరపుకోట, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిలోని ఆడమిల్లి సచివాలయం సమీపంలోని పాతవంతెన ఇటీవల ఒరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రాఫిక్‌ను వెంకటకృష్ణాపురం మీదుగా మళ్లించారు. వంతెన ప్రాంతం వద్ద బైపాస్ రోడ్డును వేగవంతంగా నిర్మించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఆదేశాలతో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.

అప్పనవీడులో భక్తులకు అన్నదానం

పెదపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): అప్పనవీడు అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద దాత సందీప్, హస్వికల ఆర్థిక సహకారంతో 200 మంది భక్తులకు అన్నదానం నిర్వహించినట్టు ఆలయ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కావడంతో ఉదయం స్వామికి విశేషాలంకరణ చేసి భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద భక్తులకు కల్పించిన ఏర్పాట్లను ఈవో పి.తారకేశ్వరరావు పర్యవేక్షించారు.

సొసైటీ పర్సన్ ఇన్‌చార్జిగా గన్ని

భీమడోలు, జూలై 29(ఆంధ్రజ్యోతి): ఖర్చులు తగ్గించుకుని వ్యాపారంపై దృష్టి సారించి సొసైటీలను అభివృద్ధిపథంలో నడిపించేందుకు ఉద్యోగులు, సిబ్బంది సహకరించాలని ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. భీమడోలు రైతు సేవా సహకార సంఘం పర్సన్ ఇన్‌చార్జిగా గన్ని మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. సొసైటీల్లో రైతులు రుణాలు తేసుకునేలా సిబ్బంది సహకరించాలని గన్ని పేర్కొన్నారు. ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్ రెడ్డి, డీసీసీబీ ఈవో సింహాచలం, డీసీసీబీ అధికారులు పాల్గొన్నారు.


నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా సురేశ్

ఏలూరుటూటౌన్, జూలై 29(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా ఎం.వి.సురేశ్‌ను నియమించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఏ.భానుప్రతాప్, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబులు నియామక పత్రాలు అందజేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.వి.నారాయణ, అడ్వకేట్ కె.వి.కన్నారావు, మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు, అందే జగదీశ్ పాల్గొన్నారు.

డస్ట్‌బిన్‌ల అందజేత

పెదపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): హనుమాన్ జంక్షన్ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆశాజ్యోతి వికలాంగుల పాఠశాలకు డస్ట్‌బిన్‌లను ఆ పాఠశాల ఫౌండర్ మరీదు వెంకటస్వామికి మంగళవారం అందజేశారు. మానవత చేపట్టిన సేవా కార్యక్రమాల్లో భాగంగా వికలాంగుల పాఠశాలకు డస్ట్‌బిన్‌లు అందజేసినట్టు తెలిపారు. మానవత సభ్యులు మారుబోయిన కోటేశ్వరరావు, బాణాల నరసింహారావు, గణేష్, జేవీవీ సత్యనారాయణ, కొండలరావు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాడుతున్న తొమ్మిది మంది అరెస్ట్

పెదపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): అప్పనవీడులో పేకాడుతున్నారనే సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడి చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్.ఐ. కట్టా శారదా సతీష్ తెలిపారు. వీరి నుంచి రూ.9,260 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

చికెన్ వ్యర్థాల వాహనం పట్టివేత

చేపల చెరువులో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా ఒక ఐషర్ వాహనాన్ని, అందులో చికెన్ వ్యర్థాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్.ఐ. సతీశ్ తెలిపారు. వాహన యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

పెదపాడులో భారీ వర్షం

పెదపాడు, జూలై 29(ఆంధ్రజ్యోతి): వాతావరణం ఒక్కసారిగా మారి మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. భారీవర్షం కురవడంతో వర్షం నీటితో పాటుగా అంతర్గత రహదారుల వెంబడి వున్న డ్రెయిన్లలో మురుగునీరు పొంగి రోడ్లపైకి చేరింది. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు తడిసిముద్దయ్యారు. వరినాట్లు ముమ్మరంగా సాగుతున్న వేళ కురిసిన వర్షం పంటలకు, నాట్లు వేసేందుకు ఉపయోగకరంగా ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, జూలై 29(ఆంధ్రజ్యోతి): చాటపర్రు సెక్షన్ 33 కేవీ గుడివాకలంక సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త లైన్ ఏర్పాటు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొక్కిరాయిలంక, పైడిచింతపాడు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ఆ శాఖ ఆపరేషన్ సర్కిల్ ఇంజనీర్ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు.

పెదవేగి సెక్షన్ పరిధిలో..

దెందులూరు: పెదవేగి సెక్షన్ పరిధిలోని కూచింపూడి, రామసింగవరం ఫీడర్లకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిచిపోనుందని అంబేద్కర్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రామసింగవరం పరిధిలో వ్యవసాయ విద్యుత్ తెల్లవారు జామున 3 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 3 నుంచి 6గంటల వరకు రెండు విడతలగా ఇస్తామన్నారు. పెదవేగి సబ్‌స్టేషన్ పరిధిలో ఎంపీడీవో కార్యాలయం, సీతారామపురం, ఎస్ ఎంపీ స్కూల్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందన్నారు.

పుట్టినరోజున మొక్క నాటాలి

ముసునూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ పుట్టినరోజు నాడు ఒక మొక్కను నాటి సంరక్షించినప్పుడే పర్యావరణంలో సమతుల్యత సాధ్యమైతుందని ప్రధానోపాధ్యాయుడు పసుమర్తి రామకృష్ణారావు అన్నారు. రమణక్కపేట జడ్పీపాఠశాలలో 9వ తరగతి విద్యార్థి రేమల్లి రుషివర్ధన్ పుట్టినరోజు సందర్భంగా పాఠశాలలో హెచ్‌ఎం మొక్కను నాటించారు. పుట్టినరోజున మొక్క నాటిన విద్యార్థికి ఆ మొక్క తనదన్న భావన ఉంటుందన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

మండవల్లి జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పర్యావరణానికి, గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సర్పంచ్ మెండా ఝాన్సీ తెలిపారు. మండవల్లిలో వీధీధ ప్రదేశాల్లో మంగళవారం శానిటేషన్ సిబ్బంది చేసే క్లీనింగ్ పనులను ఆమె పరిశీలించారు. ఇంటిలోని తడిచెత్త, పొడి చెత్తను గ్రామస్థులు విడివిడిగా శానిటేషన్ సిబ్బందికి ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యూపీ స్కూళ్ల డీగ్రేడ్‌పై ప్రత్యేక విచారణ
కలెక్టర్ ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ముదినేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ముదినేపల్లి మండలంలోని అన్ని మండల పరిషత్ యూపీ పాఠశాలలు డీగ్రేడ్ అయి బేసిక్ ప్రైమరీ పాఠ శాలలుగా మారడంతో 6,7,8 తరగతుల చదువులకు హైస్కూళ్ళకు వెళ్ళడంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేక విచారణ జరపాలని కలెక్టర్ వెట్రిసెల్వి నిర్ణయించారు. 'చదువులు దూరం' అనే శీర్షికన ఈనెల 25న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్ దీనిపై పూర్తి స్థాయి విచారణ నిర్వహించి నివేదికను అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మను ఆదేశించారు. మండలంలోని తొమ్మిది యుపి పాఠశాలలు డీగ్రేడ్ కాగా కోడూరు యూపీ స్కూలును యధాతధంగా కొనసాగిస్తుండగా దాకరం, చిన కామనపూడి, వణుదుర్రు, వాడవల్లి, కాకరవాడ, చేవూరు, దేవపూడి, కొరగుంట పాలెం యుపి పాఠశాలలో బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలల విద్యార్థులు అల్లూరు, పెదగొన్నూరు, ముదినేపల్లి, సింగరాయ పాలెం హైస్కూళ్ళతోపాటు కలిదిండి మండలం కోరుకొల్లు, కృష్ణాజిల్లాలోని బంటుమిల్లి మండలం మల్లపరాజుగూడెం, పెడన మండలం చెన్నూరు హైస్కూళ్ళకు సుమారు అయిదు నుంచి 8 కిలోమీటర్ల దూరం వెళుతున్నారు. కలెక్టర్ ఆదేశాలతో డీఈవో ఇద్దరు విద్యాశాఖ అధికార్లను విచారణకు నియమించారు. వారు మంగళవారం బైక్‌లపై మీటర్ రీడింగ్ ఏర్పాటు చేసుకుని డీగ్రేడ్ అయిన యూపీ పాఠశాలల నుంచి విద్యార్థులు వెళుతున్న హైస్కూళ్ళకు దూరాన్ని అంచనా వేసే ప్రక్రియను నిర్వహించారు. వివరాలను హెచ్‌ఎంలు, విద్యాశాఖ అధికార్లకు పంపారు. జిల్లా అధికార్లు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు నేడు, రేపు మండలానికి రానున్నట్లు తెలిసింది.



ఆక్రమణ తొలగించాలని రైతుల రాస్తారోకో

చాట్రాయి, జూలై 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూములకు వెళ్ళే రోడ్డు ఆక్రమణ తొలగించాలని కోరుతూ మంగళవారం మండలంలోని సూరంపాలెం రైతులు విజయవాడ-సత్తుపల్లి రహదారిలో రాస్తారోకో నిర్వహించారు. రాస్తారోకోకు నాయకత్వం వహించిన మండల టీడీపీ నాయకుడు నక్కా రాము మాట్లాడుతూ సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూములకు వెళ్ళే రోడ్డును ములగలపాటివారిగూడెంకు చెందిన ఓ వ్యక్తి ఆక్రమించి షెడ్డు నిర్మాణం చేపట్టాడన్నారు. ఈ సమస్యపై కలెక్టర్, రెవెన్యూ, పోలీస్ అధికారులకు రెండు నెలలుగా ఫిర్యాదులు చేస్తున్నా ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణ తొలగించపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. రాస్తారోకో సమాచారం తెలుసుకొని చాట్రాయి, విస్సన్నపేట పోలీసులు వచ్చి త్వరలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వటంతో రాస్తారోకో విరమించారు. సుమారు అరగంట పాటు జరిగిన ఈ రాస్తారోకోతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

నూజివీడు టౌన్, జూలై 29 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జి. విద్యాసాగర్ అన్నారు. సీతారాంపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన రైతులతో సమావేశమై మాట్లాడుతూ జీవన ఎరువులు, పచ్చిరొట్ట ఎరువుల వాడకం వల్ల రసాయన ఎరువుల వినియోగాన్ని 30% వరకు తగ్గించవచ్చు అన్నారు. అలాగే యూరియా డీఏపీలకు బదులు నానో యూరియా, నానో డీఏపీలను వాడాలని సూచించారు. రైతులకు పంటల బీమా ఉపయుక్తంగా ఉంటుందని వరి పంటకు ఎకరానికి 840 ప్రీమియంగా చెల్లిస్తే అననుకూల వాతావరణ పరిస్థితుల్లో రూ. 42 వేల వరకు బీమా వర్తిస్తుందన్నారు. డీఆర్సీ ఏలూరు వ్యవసాయ శాఖ అధికారిణి ఎం. ఉషాకుమారి, మండల వ్యవసాయాధికారి చెన్నారావు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



వల్లభేశ్వరస్వామికి వెండి నాగ పడగ సమర్పణ

కలిదిండి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురంలో వేంచేసి ఉన్న శ్రీ వల్లభేశ్వరస్వామి వారికి దాత ఏఎంసీ మాజీ ఛైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి దంపతులు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చేతులమీదుగా వెండి నాగ పడగను మంగళవారం సమర్పించారు. టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, సర్పంచ్ గూడవల్లి శ్రీనివాసరావు, ఆలయ మేనేజర్ గోపాలరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఈ ఆహారం తినలేం..


- ఎలుకల పెంట, పురుగుల బియ్యంతో ఆహారం
- కామవరపుకోట హైస్కూలు విద్యార్థుల గగ్గోలు



విద్యార్థులు డస్ట్‌బిన్‌లో పడవేసిన ఆహారం

కామవరపుకోట, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోట హైస్కూలులో సోమ, మంగళవారాల్లో ఎలుకల పెంట, పురుగులు పట్టిన బియ్యంతో ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు పెట్టగా వారు తినకుండా డస్ట్‌బిన్‌లో పడవేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఎంసీ ఛైర్మన్ బొబ్బిలి డాన్ దివాకర్ పాఠశాలకు చేరుకుని విద్యార్థుల నుంచి వివరాలను తెలుసుకున్నారు. ఆహారం తినలేకపోతున్నామని విద్యార్థులు ఆయనకు తెలిపారు. దీంతో దివాకర్ ఎంఈవోలు డి.సుబ్బారావు, ప్రశాంతకుమార్‌తో చర్చించారు. ఎంఈవోలు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో ఉన్న బియ్యాన్ని వారానికి రెండు రోజులు వండాలని ఆదేశించడంతో ఆ బియ్యాన్ని వండుతున్నామని, మిగిలిన రోజుల్లో సన్న బియ్యంను వండుతున్నామని చెప్పారు. ఇక నుంచి ఆ బియ్యాన్ని ఉపయోగించబోమని, సన్న బియ్యంతోనే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యతా ప్రమాణాలతో ఆహారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

అమ్మో.. రోడ్లు!

- బురద రోడ్లతో ప్రజలకు ప్రమాదాలు
- జగనన్న కాలనీలో నిర్మాణమే మరిచారు!

వైసీపీ హయాంలో రహదారులను పట్టించుకోకపోవడంతో ప్రజల పాట్లు అన్నీ ఇన్నీ కావు. కొద్దిపాటి వర్షానికే ఇబ్బందులు పడుతున్నారు. ఇక జగనన్న కాలనీలో అయితే లబ్ధిదారులు పలువురు మౌలిక వసతుల్లేక ఇళ్లనే నిర్మించుకోలేదు.



బురదమయంగా చిల్లబోయినపల్లి రహదారి

ముసునూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లబోయినపల్లి- మడిచర్ల ప్రధాన రహదారి బురదకయ్యగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఈ రహదారిలో పలువురు ప్రమాదానికి గురై గాయాలపాలవుతున్నారని స్థానికులు చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధిని విస్మరించడంతో మరింతగా ధ్వంసమైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారి సమస్యలపై మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళి ఏడాదైనా చర్యలు లేవని గ్రామస్థులు చెబుతున్నారు. ఇప్పటికైన ఈ రహదారిని కనీసం గ్రావెల్‌తో అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

అమ్మో.. అన్నవరం కాలనీ!

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం అన్నవరం గ్రామంలోని జగనన్న కాలనీ వర్షాలకు అధ్వానంగా మారింది. కాలనీ బి-బ్లాక్‌లో రోడ్లు నిర్మించకపోవటంతో చిన్నపాటి వర్షానికే నీరు నిలుస్తోంది. బ్లాక్‌లో సుమారు 50 మందికి స్థలాలు ఇచ్చినా రోడ్ల సౌకర్యం లేక 20 మందే ఇళ్లు నిర్మించుకున్నారు. ఇటీవల వర్షాలకు కాలనీలో పల్లపు ప్రాంతాలుగా ఉన్న రోడ్లు జలమయమయ్యాయి. వర్షపు నీటిలోకి సమీప పొలాల నుంచి పాములు చేరుతున్నాయి. రోడ్ల నిర్మాణానికి గత నాలుగేళ్లుగా నిధులు మంజూరు కాలేదని అధికారులు చెబుతున్నారు.





సొంత ఖర్చుతో తుప్పల తొలగింపు

చాట్రాయి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని చనుబండ జడ్పీ హైస్కూల్ ఆవరణలో తుప్పలు, గడ్డి పెరిగి పాములు సంచరిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు మోరంపూడి రమేష్ సొంత నిధులతో మంగళవారం హైస్కూల్ ఆవరణలో తుప్పల తొలగింపు పనులు చేపట్టారు. టీడీపీ నాయకులు కందుల కృష్ణ, చీదిరాల మారేశ్వరరావు, బొంతు సతీష్, ముత్తయ్య, వీరాస్వామి పాల్గొన్నారు.

సర్పంచ్ పదవిని ఎస్టీకి కేటాయించాలి

ముసునూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేట పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్టీలకు కేటాయించాలని స్థానికుడు, సామాజిక కార్యకర్త గరికె అఖిల్ మంగళవారం నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు వినతి పత్రం ఇచ్చారు. పంచాయితీ ఏర్పడి 62 ఏళ్లయినా ఒక్కసారి కూడా ఎస్టీలకు అవకాశం రాలేదన్నారు. వచ్చే పంచాయతీ ఎన్నికల్లో రమణక్కపేట పంచాయతీకి ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని సబ్ కలెక్టర్‌ను అఖిల్ కోరాడు.





ముసునూరు, చాట్రాయిలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అసత్య కథనాలను ప్రచురిస్తే ఊరుకోం

ముసునూరు, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొలుసు పార్థసారథిపై జగన్ పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనం అర్థరహితమని టీడీపీ నాయకులు ఖండించారు. నియోజకవర్గ తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి), బీసీసెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నక్కా యోహాను మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే రాష్ట్రానికి వచ్చే పెట్టుబ డులను అడ్డుకునేలా జగన్ పత్రిక అసత్య కథనాలు ప్రచురిస్తూ ప్రజల్లో అపోహలు సృష్టించడం నీచమన్నారు. అసత్య కథనాలను ప్రచురిస్తే సహించేది లేదని పత్రిక యాజమాన్యాన్ని హెచ్చరించారు.

చాట్రాయి: మంత్రి పార్థసారథిపై జగన్ పత్రికలో అవాస్తవ కథనాలు ప్రచురించి అభివృద్ధిని అడ్డుకోవటానికి కుట్ర చేస్తున్నారని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బసవారెడ్డి, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, శేఖర్, మండల మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తోటపల్లి వద్ద కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంటు నిర్మాణానికి మంత్రి సారథి కుటుంబానికి చెందిన కంపెనీకి 45.60 ఎకరాలు భూమి నిబంధనల మేరకే కేటాయించగా, 846.60 ఎకరాలు అంటూ అవాస్తవాలు ప్రచురించటం దారుణమన్నారు. ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని సర్వనాశం చేసిన జగన్ అండ్ కో ఇప్పుడు రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా పథకం ప్రకారం కుట్రకు పాల్పడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

స్వర్ణ కైకలూరుగా తీర్చిదిద్దాలి : కామినేని



పీ-4 సమావేశంలో మాట్లాడుతున్న కామినేని

కైకలూరు, జూలై 29(ఆంధ్రజ్యోతి): స్వర్ణ కైకలూరుగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మంగళవారం కైకలూరులో పీ-4పై నియోజకవర్గ ప్రత్యేక అధికారి నరసయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందిన వారు పేదవర్గాల వారిని దత్తత తీసుకుని వారిని అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. అలాగే విద్యా, వైద్యం, వ్యాపారం, కెరీర్ గైడెన్స్‌తో వారి కుటుంబాలను అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. కైకలూరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఎంపీడీవోల పర్యవేక్షణలో పేద కుటుంబాలను గుర్తించడమే గాక వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు చేపల రైతులు, ఫ్యాక్టరీల నిర్వహకులతో తానే స్వయంగా మాట్లాడి సహాయ సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటానన్నారు. లింకు రోడ్లు అభివృద్ధి చేసి గ్రామాల మధ్య దూరాన్ని తగ్గించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించా రు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కూటమి నేతలు పెన్మెత్స త్రినాథరాజు, పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస చౌదరి, పూల రామచంద్రరావు, ఎండీ జానీ, మంగినేని రామకృష్ణ, కోటప్రోలు కృష్ణారావు, కొల్లి వరప్రసాద్, తోట లక్ష్మీ, నాలుగు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, వివిధ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వార్లకోడు ఆక్రమణలను తొలగించాలి

వార్లకోడు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కామినేని అన్నారు. మంగళవారం కైకలూరు పట్టణంలో వార్లకోడు డ్రెయిన్‌ను ఆయన పరిశీలించారు. కైకలూరు గ్రీన్‌విలేజ్‌లో కాంట్రాక్టర్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ కాంట్రాక్టర్ ఇళ్ళ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు. అలాగే గ్రీన్‌విలేజ్‌లోని లబ్ధిదారులు వారి ఇళ్ల నిర్మాణ సమస్యలను తెలుసుకునేందుకు ఈ కార్యాలయాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం...

గ్రామాల మధ్య రహదారులను అభివృద్ధి చేసి ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంగళవారం వదర్లపాడు నుంచి నరసాయిపాలెం వెళ్లే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి మరింత పటిష్టంగా రహదారులు నిర్మించాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. వదర్లపాడు, నరసాయిపాలెం సర్పంచ్‌లు వడుపు నాగమణి, రాధాకృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు



నెక్కలం గొల్లగూడెంలో..

కలిదిండి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం కోరుకొల్లు 212వ బూత్‌లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి భోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: మండలంలోని నెక్కలం గొల్లగూడెంలో మంగవారం టీడీపీ నాయకులు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు పంచి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కాజా కుటుంబరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రటరీ నల్లమోతు రమేష్, డిల్లీ గురవయ్య, ఉల్లం ఏడుకొండలు, నల్లమోతు నవీన్, మల్లంపల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు కావలెను

(5వ పేజీ తరువాయి)

ఒక పోస్టు ఉండగా అది భర్తీ చేశారు. సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీల్లో ప్రొఫెసర్, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. న్యూరాలజీలో సైతం ప్రొఫెసర్. అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెండు, న్యూరోసర్జరీ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీ. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టు ఒకటి భర్తీ చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండు పోస్టులు ఉండగా రెండు ఖాళీగానే ఉన్నాయి. నెఫ్రాలజీ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రెండు, యూరాలజీ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రెండు ఖాళీగానే ఉన్నాయి. మొత్తం సూపర్‌స్పెషాల్టీ విభాగాలకు ఏడు ప్రొఫెసర్ పోస్టులకు ఏడూ ఖాళీగానే ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు 8 ఉండగా, ఏడు ఖాళీగానే ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 13 ఉండగా 12 ఖాళీగా ఉన్నాయి. ఉన్న సిబ్బంది పైనే భారం పడుతున్నా నాణ్యమైన విద్యనందించడానికి వారు ప్రయత్నాలు కొనసాగిస్తూనే ఉన్నారు. కిందిస్థాయి సిబ్బంది 35 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటి భర్తీకి ఇటీవల డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రస్తుతం దరఖాస్తులను కంప్యూటరీకరణ చేసి మెరిట్‌ను క్రోడీకరిస్తున్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు మొదటి సంవత్సరం అనాటమి, ఫిజియోలజీ, బయోకెమిస్ట్రీ సబ్జెక్టులు ఉంటాయి. వీటికి సంబంధించిన ల్యాబ్‌లలో అవసరమైన రియాజెంట్స్, స్ట్రిప్స్ లేవని, విద్యార్థులే బయట సర్జికల్ షాపుల నుంచి కొనుగోలు చేసుకుంటున్నట్లు సమాచారం. ద్వితీయ సంవత్సరంలో మైక్రో బయోలజీ, ఫార్మకాలజీ, పెథాలజీ సబ్జెక్టులు ఉండగా ల్యాబ్‌లు ఏలూరు ప్రభుత్వాస్పత్రి, పాత బస్టాండ్ సమీపంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉన్నాయి. ఏలూరు ప్రభుత్వాస్పత్రి ల్యాబ్‌ల్లో అన్ని విభాగాల మెటీరియల్, అవసరమైన కిట్స్ అందుబాటులో లేవని తెలుస్తోంది.

మూడో సంవత్సరంలో ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, ఎస్పీఎం (సోషల్ ప్రివెంట్ మెడిసిన్) కమ్యూనిటీ మెడిసిన్, ఫోరెన్సిక్ మెడిసిన్ సబ్జెక్టులు ఉంటాయి. ఫోరెన్సిక్ విభాగానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఎలాంటి ల్యాబ్ కాని ప్రత్యేక విభాగం లేదు. కేవలం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించడం వరకే పరిమితం. ఇతర వైద్య పరీక్షలకు విజయవాడ, గుంటూరు పంపిస్తున్నారు. వివిధ మృతదేహాల నుంచి తీసిన అవయవ భాగాలను విజయవాడ ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. మూడో సంవత్సరంలోకి వస్తున్న విద్యార్థులు ఏవిధంగా విద్యను అభ్యసిస్తారో అన్నది గందరగోళంగా మారింది. ఇప్పటికైనా పోస్టులు భర్తీ చేసి మెరుగైన విద్యను అందించాల్సి ఉంది.

పోస్టుల భర్తీకి చర్యలు



ప్రభుత్వ మెడికల్ కాలేజీలో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పిస్తున్న నేపథ్యంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులన్నీ భర్తీ అయ్యే అవకాశాలున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. మిగిలిన 35 పోస్టుల భర్తీకి ఇప్పటికే డిస్ట్రిక్ట్ సెలక్షన్ కమిటీ ద్వారా నోటిఫికేషన్ జారీ అయింది. మూడో బ్యాచ్ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థులు చేరే నాటికి అన్ని పోస్టులు భర్తీ చేయడానికి అధికారులు చర్యలు తీసుకున్నారు. ల్యాబ్‌ల్లో అవసరమైన మెటీరియల్ అందుబాటులో ఉన్నాయి. మొదటి సంవత్సరం విద్యార్థులు రాష్ట్ర స్థాయిలోనే ఉత్తమ ర్యాంకులు సాధించారు. విద్యార్థులతో ఎప్పటికప్పుడు మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

-డాక్టర్ పి.సావిత్రి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఏలూరు

కదిలారు.. కదిలించారు..

(5వ పేజీ తరువాయి)

వెళ్లి టీడీపీ ప్రభుత్వ విజయాలను వివరించగలిగారు. సీనియర్ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న దెందులూరు నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ నిర్విరామంగా పనిచేసింది. ప్రతీ ఊరిలో పండుగ వాతావరణం తలపించేలా చింతమనేని యాత్ర సాగింది. ఇప్పటి దాకా ఈ నియోజకవర్గంలో 74.75 శాతం నివాస గృహాలను టచ్ చేయ గలిగారు. చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌తో పాటు మిగతా కేడర్ 46.88, కైకలూరులో 47.95, పోలవరంలో 32.02 శాతం నివాస గృహాలను ఆయా కుటుంబాలను స్థానిక నేతలు కలుసుకోగలిగారు. పోలవరం నియోజకవర్గం నుంచి జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజు ప్రాతినిధ్యం వహిస్తుండగా జిల్లాలో విస్తీర్ణంలో అతి పెద్దదైన ఈ నియోజకవర్గంలో ఆయా కుటుంబాలను కలుసు కోవడానికి తెలుగుదేశం ప్రయత్నించింది. కైకలూరులో బీజేపీ ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఈ నియోజకవర్గంలో కూడా టీడీపీ వెనుకంజ వేయకుండా ఆయా గ్రామాల్లో కుటుంబాలను టచ్ చేస్తూనే వచ్చింది. మొత్తం మీద తొలి అడుగులో ఏలూరు జిల్లావ్యాప్తంగా ప్రజలతో మమేకం కావడంలో టీడీపీ ఒకింత విజ యం సాధించినట్లే కనిపిస్తోంది.

నేటితో ముగియనున్న త్రిసభ్య కమిటీల గడువు
రెన్యువల్ ఉత్తర్వుల కోసం ఎదురుచూపులు

ముదినేపల్లి, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు ప్రభుత్వం నామినేట్ చేసిన త్రిసభ్య కమిటీల పదవీ కాలం బుధవారంతో ముగియనుంది. తొలి, రెండవ జాబితాల్లో ఏర్పాటైన ఈ కమిటీల గడువు ఈ నెల 30తో ముగుస్తుంది. తిరిగి ఈ కమిటీల పదవీ కాలాన్ని ఆరు నెలలపాటు కొనసాగిస్తూ ప్రభుత్వం రెన్యువల్ ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది. ముదినేపల్లి మండలంలో 15 పీఏసీఎస్‌లు ఉండగా, పదింటికి త్రిసభ్య కమిటీలు ఏర్పాటు కాగా, తొమ్మిది సంఘాల కమిటీలు పదవీ బాధ్యతలు చేపట్టాయి. గోకినంపాడు పీఏసీఎస్ కమిటీ సభ్యుడిగా నియమితులైన ఒక సభ్యుడు మరణించటంతో ప్రమాణ స్వీకారం జరగలేదు. మండలంలోని గురజ, ముదినేపల్లి, పెనుమల్లి, దాకరం, దేవపూడి పీఏసీఎస్‌లకు ఇంకా త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేయకపోవటంతో అధికారిక పర్సన్ ఇన్‌చార్జి (పీఐసీ)లే కొనసాగుతున్నారు. వీరి పదవీ కాలం కూడా ఈ నెల 31తో ముగియనుంది. ప్రస్తుత త్రిసభ్య కమిటీలు, పీఐసీల పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. పెండింగ్‌లో ఉన్న సంఘాలకు కూడా కమిటీలను ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది.

కృష్ణవరం కమిటీ ప్రమాణ స్వీకారం

ఆగిరిపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్‌గా జనసేనకు చెందిన కొండేటి శ్రీనివాసరావు నియమితులయ్యారు. మంగళవారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో అధ్యక్షుడిగా కొండేటి శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా పోట్రు రామారావు, వీరబత్తిన విశ్రాంతం ప్రమాణ స్వీకారం చేశారు. వీరిని కూటమి నాయకులు సత్కరించారు. నూజివీడు నియోజకవర్గం జనసేన సమన్వయకర్త బర్మా ఫణిబాబు, బీజేపీ మండల కన్వీనర్ సంగ రంగారావు, మండల జనసేన ఉపాధ్యక్షుడు ముక్కు మహేష్, టీడీపీ మాజీ జడ్పీటీసీ గంపా నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాక్సినేషన్

చాట్రాయి, జూలై 29(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని చీపురుగూడెంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించి పశువులకు గాలికుంటు, గురుక, జబ్బవాపు వ్యాక్సిన్లు వేశారు. యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు శిబిరాన్ని ప్రారంభించగా, పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్ ప్రసాద లింగం వ్యాక్సిన్ వేశారు. అనంతరం పశు వైద్యాధికారి మాట్లాడుతూ పశువులకు సంభవించే సీజనల్ వ్యాధులను సకాలంలో గుర్తించి, టీకాలు వేయించటం ద్వారా పాడి పశువుల ఆరోగ్యం కాపాడుకోవచ్చునని అన్నారు. అలాగే మినరల్ మిక్చర్, నట్టల నివారణ మందు, కాల్షియం, మేలు జాతి సెమన్ వాడటం వలన కలిగే ఉపయోగాలు రైతులకు వివరించారు. అసిస్టెంట్ మేనేజర్ అనుదీప్, సూపర్‌వైజర్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌లో దూసుకుపోయిన కారు
రిటైర్డ్ సైంటిస్ట్ మృతి.. బయటపడిన భార్య

ముదినేపల్లి, జూలై 29 (ఆంధ్రజ్యోతి): పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో ముదినేపల్లి సమీపంలోని పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్‌లోకి మంగళవారం రాత్రి కారు దూసుకుపోయిన ఘటనలో భర్త మరణించగా భార్య ప్రాణాలతో బయటపడింది. మండవల్లి మండలం లింగాల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఎన్ఆర్ఎస్ఏ సైంటిస్ట్ చందు వెంకటేశ్వరరావు తన భార్య రాణితో కలసి హైదరాబాద్ నుంచి కారులో వస్తుండగా ప్రమాదవశాత్తు పోల్‌రాజ్ డ్రెయిన్‌లోకి కారు దూసుకుపోయింది. కారు డ్రైవ్ చేస్తున్న వెంకటేశ్వరరావు మరణించగా కారులో ఉన్న అతని భార్యను అక్కడ చేపల చెరువులపై పనిచేస్తున్న కొందరు యువకులు డ్రెన్‌లో దిగి కారు అద్దాలు పగుల కొట్టి ఆమెను రక్షించారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ వీరభద్రరావు సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అధికార్ల తప్పిదం వల్లే..

ఈ ప్రమాదం జరగటానికి కారణం జాతీయ రహదార్ల అభివృద్ధి సంస్థ అధికార్లదే తప్పిదమని తెలుస్తోంది. పోల్‌రాజ్ డ్రెన్‌కు ఇరువైపులా రోడ్డు విస్తరణ పనులు చేస్తుండటం, కనీసం డ్రెయిన్ వద్ద రోడ్డు డైవర్షన్ బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రెండు వైపులా వాహనాలు సరాసరి డ్రెయిన్‌లోకి వెళ్ళిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది.

కల్తీ మందులతో చేప పిల్లల మృతి

మండవల్లి జూలై 29(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలం కొవ్వాడలంకలో 12 ఎకరాల చేపల చెరువులో కల్తీ మందుల వల్ల చేప పిల్లలు చనిపోయాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మండవల్లి మండలం భైరవపట్నం గ్రామానికి చెందిన సాయిల పాండురంగ కొవ్వాడలంక గ్రామంలో 12 ఎకరాలు లీజుకు తీసుకుని కట్ల రకానికి చెందిన చేపపిల్లల చెరువులో చైనా గొరకలు నివారించడానికి కైకలూరులోని ఒక దుకాణంలో మందులు కొనుగోలు చేసి సోమవారం చెరువులో చల్లగా, మంగళవారం తెల్లవారుజాముకి చేప పిల్లలన్నీ మృతి చెందినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. మందులు వికటించి చేప పిల్లలు మృత్యువాత పడడంతో రూ. 10 లక్షల మేర నష్టపోయినట్టు వాపోయారు. దీనిపై దుకాణ యజమానితో మాట్లాడితే తమకు సంబంధం లేదని కంపెనీ వాళ్ళతో మాట్లాడుకోవాలని చెప్పినట్టు తెలిపాడు. కనీసం బ్రాండ్ పేరు లేని మందులు తమకు అంటగట్టి తీవ్రస్థాయిలో తనకు నష్టం కలిగించినట్లు రైతు ఆరోపించాడు. దీనిపై కైకలూరు ఏడీఏ పార్వతిని వివరణ కోరగా తాను ఇటీవలే చార్జి తీసుకున్నట్లు త్వరలో దుకాణాన్ని తనిఖీ చేస్తామని తెలిపారు.

సారా స్వాధీనం

చాట్రాయి, జూలై 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంలో మంగళవారం ఎక్సైజ్ దాడిలో 10 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. సాదరబోయన మరియమ్మపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ భోగేశ్వర రావు, సబ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

సవరణ

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ విజయవాడ-4 బ్రాంచ్ వారు ది.19-07-2025 న ప్రచురించిన మావులూరి సునీత గారి యాడ్ లో పొరపాటున లోన్ తీసుకునే వారి పేరు మావులూరి వెంకటేష్ అని తప్పుగా పడినది దీనిని మావులూరి పున్నారావు గా చదువుకొనగలరు.

వై. విజయకుమార్, న్యాయవాది,
డి.నెం. 20-4-21, లోటస్ ల్యాండ్ మార్క్ దగ్గర,
శాంతి నగర్ విజయవాడ -3 సెల్ నెం.99490 77010